PRGI NO : TGTEL/26/A2002
EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA
తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 119 | పేజీలు : 8 | శనివారం 19 సెప్టెంబర్ 2026 | వెల : 4/-




## ఆర్టీసీలో ఎన్నికల
# నగారా



- గుర్తింపు సంఘాల ఎలక్షన్ షెడ్యూల్ విడుదల
- ఎనిమిదేళ్ల నిరీక్షణ తర్వాత టీజీఎస్‌ఆర్టీసీలో గుర్తింపు సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది
- ఈనెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుండగా అక్టోబర్ 9న ఎన్నికలు, అక్టోబర్ 17న ఫలితాలు విడుదల కానున్నాయి.

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో (టీజీఎస్‌ఆర్టీసీ) మరోసారి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలకు రంగం సిద్ధమైంది. కార్మికులు ఎనిమిదేళ్లుగా ఈ ఎన్నికల కోసం ఎదురుచూస్తుండగా ఎట్టకేలకు షెడ్యూల్ ఖరారైంది. ఈ మేరకు కార్మిక శాఖ జాయింట్ డైరెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ నెల 21 నుంచే ఎన్నికల ప్రక్రియ - మిగతా3లో



## జమ్మూకశ్మీర్‌లో
# ఉగ్ర ముఠా గుట్టురట్టు

- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించిన ముగ్గురు నిందితులు అరెస్ట్
- లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన నిందితులు
- వారిని అదుపులోకి తీసుకొని దర్యాప్తు చేస్తున్న అధికారులు

## మాకు మరో 9.56 లక్షల ఇళ్లు
# కేటాయించండి

- కేంద్రమంత్రిని కోరిన సీఎం రేవంత్‌రెడ్డి
- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కలిసిన సీఎం రేవంత్‌రెడ్డి
- సీఎం వెంట మంత్రులు పొంగులేటి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు
- తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు సీఎం కేంద్రమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు
- తెలంగాణకు 2 లక్షల పీఎంఏవైజీ ఇళ్లు



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రానికి మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో కేంద్రమంత్రిని సీఎం రేవంత్ రెడ్డి కలిశారు. సీఎం వెంట మంత్రులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల, సీఎస్ సంజయ్ జాజు ఉన్నారు. తెలంగాణకు 2 లక్షల ఇళ్లు కేటాయించినందుకు ముఖ్యమంత్రి శివరాజ్?సింగ్?కు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి ఆవాస్? యోజన పథకంలో భాగంగా రాష్ట్రానికి తొలి విడతలో 2 లక్షల ఇళ్లను కేటాయించిన సంగతి తెలిసిందే. తెలంగాణలోని 11.56 లక్షల పేద కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేయాలని సీఎం గతంలో కేంద్రానికి విజ్ఞప్తి చేయగా, 2 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన 9.56 లక్షల ఇళ్లు కేటాయించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై - మిగతా3లో

# 22ఏ భూముల సమస్యలకు చెక్!

- హైలెవల్ కమిటీ ఏర్పాటు చేసిన ప్రభుత్వం
- 22ఏ భూములతో పాటు పలు భూ సమస్యలను పరిష్కరించేలా ప్రభుత్వం కీలక నిర్ణయం
- ఈ మేరకు సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్‌కుమార్ నేతృత్వంలో హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది.
- జీవో నంబర్118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ



## నందిగ్రామ్ ఉపఎన్నికల్లో 'దీదీ'కి షాక్

- బరిలో నుంచి తప్పుకున్న అభ్యర్థి
- కాంగ్రెస్‌కు మద్దతు
- బంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం
- నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో నుంచి తప్పుకున్న మమతా వర్గం అభ్యర్థి
- నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడానికి ఒక్క రోజు ముందు నామినేషన్ ఉపసంహరణ





## మోదీకి యూఏఈ అధ్యక్షుడు ఫోన్

- బర్త్‌డే విషెస్ చెప్పి పశ్చిమాసియా పరిణామాలపై చర్చ!
- ప్రధాని నరేంద్ర మోదీ 76వ పుట్టిన రోజు సందర్భంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపిన యూఏఈ అధ్యక్షుడు
- పశ్చిమాసియా పరిణామాలు సహా ఇతర అంశాలపై ఇరువురు నేతల చర్చ



## ఓటు చోరీ.. అధికారం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ

- ఈసీపై రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు
- టీఎంసీ పార్టీ గుర్తును వాదొద్దని మమతా బెనర్జీ వర్గాన్ని ఆదేశించిన ఈసీ
- తీవ్రంగా ఖండించిన రాహుల్ గాంధీ
- "మొదట శివసేన, ఆ తర్వాత ఎన్‌సీపీ, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్.



## దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురు

- ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు
- ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు
- ఈ విషయంలో స్పీకర్ నిర్ణయాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తప్పుపట్టింది
- అనర్హత పిటిషన్లను కొట్టివేస్తూ స్పీకర్ తీసుకున్న నిర్ణయాన్ని హైకోర్టు రద్దు చేసింది.

# తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం

- సాగునీటి కంటే తాగునీటికి తొలి ప్రాధాన్యం
- తాగునీటికి తొలి ప్రాధాన్యమిస్తున్నామని ప్రభుత్వం స్పష్టీకరణ
- ఎల్‌నినోపై అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ
- రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు కనిపిస్తున్నాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కొనేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.



హైదరాబాద్

రాష్ట్రంపై ఎల్‌నినో తీవ్రస్థాయిలో ప్రభావం చూపుతోందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. వర్షాలు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా తాగునీటికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని స్పష్టంచేశారు. ఇలాంటి కీలక సమయంలో కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని అసెంబ్లీ వేదికగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఎల్?నినోపై ప్రభుత్వం అసెంబ్లీలో సల్పకాలిక చర్చ చేపట్టింది. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి, దేశ వ్యవసాయ రంగానికి జీవనాధారమైన నైరుతి రుతుపవనాలపై ఎల్?నినో ప్రభావం ఉందని చెప్పారు. ఈ పరిస్థితుల దృష్ట్యా ఏ పంటలు వేస్తే బాగుంటుందో రైతులకు ముందుగానే తెలియజేశామన్నారు. వర్షాలు పడక శ్రీశైలం, నాగార్జున సాగర్‌లో గతేడాది - మిగతా3లో



## పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుంది

- ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను ఖండించిన భారత్
- పాక్ నౌక ప్రమాదకర రీతిలో దూసుకురావడం వల్లే ప్రమాదం జరిగిందన్న విదేశాంగ శాఖ
- 1991 ద్వైపాక్షిక ఒప్పందాన్ని పాక్ ఉల్లంఘించిందని వ్యాఖ్య

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
19 సెప్టెంబర్ 2026

# ఓటు చోరీ, అధికారం చోరీ.. ఇప్పుడు పార్టీ చోరీ

బంగాల్ ఉపఎన్నికల్లో మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్? కాంగ్రెస్ (టీఎంసీ)ని పార్టీ పేరు, గుర్తులను ఉపయోగించవచ్చని ఎన్నికల సంఘం (ఈసీ) ఆదేశించడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ప్రజాతీర్పును కాపాడడమే ఎన్నికల సంఘం ప్రధాన విధి అని, కానీ దానికి బదులుగా అది ప్రజల తీర్పును తారుమారు చేసే శక్తులకు సహకరిస్తోందని శుక్రవారం తీవ్ర విమర్శలు చేశారు. "మొదట శివసేన, ఆ తర్వాత ఎన్సీపీ, ఇప్పుడు తృణమూల్ కాంగ్రెస్. ప్రతిసారీ ఇదే పద్ధతి. పార్టీలను చీల్చడానికి బీజేపీ, ఎన్నికల సంఘం చేతులు కలుపుతాయి. ఆ తర్వాత వాటి ఎన్నికల గుర్తును లాగేసుకుంటాయి. ఒక పార్టీ మొత్తాన్నే దొంగిలించగలిగినప్పుడు, కోట్లాది మంది భారతీయుల ఓట్లను కూడా చోరీ చేయడంలో ఆశ్చర్యం లేదు. ఓటు చోరీ, గవర్నమెంట్ చోరీ, ఇప్పుడు పార్టీ చోరీ- ఇవి మన ప్రజాస్వామ్య పతనానికి చిహ్నాలుగా మారాయి. అందుకే ఈ పోరాటం కేవలం మమతా బెనర్జీది మాత్రమే కాదు. ఇది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు కోరుకునే ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ఓటరు పోరాటం" అని రాహుల్ గాంధీ ఎక్స్? వేదికగా పేర్కొన్నారు.

### మోదీకి పుట్టిన రోజు కానుక

బంగాల్ ఉప ఎన్నికల వేళ ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్? (ఏఐటీసీ) వర్గాలు తమ పార్టీ గుర్తు వాడకూడదని ఎన్నికల సంఘం ఆదేశించింది. అలాగే శుక్రవారం ఉదయంలోగా తమకు నచ్చిన పేర్లు, గుర్తులను సమర్పించాలని కోరింది. దీనిని కాంగ్రెస్ పార్టీ గురువారం



తీవ్రంగా ఖండించింది. ఇది రాజ్యాంగ బాధ్యతల నుంచి ఎన్నికల సంఘం తప్పుకోవడమేనని విమర్శించింది. ఏఐటీసీ పేరు, గుర్తును నిలిపివేయడం అనేది ప్రధాని నరేంద్ర మోదీకి సీఈసీ జ్ఞానేశ్ కుమార్? 'అర్ధరాత్రి ఇచ్చిన పుట్టినరోజు కానుక' అని కాంగ్రెస్ ఎద్దేవా చేసింది.

### ఎవరికీ నష్టం వాటిల్లకుండా ఉండేందుకే!

గురువారం రాత్రి ఈసీ ఈ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. వీటిపై మమతా బెనర్జీ, అరూప్రాయ్? నేతృత్వంలోని రెండు వర్గాల నాయకుల వాదనలు విన్న తర్వాత 'ఎలక్షన్ సింబల్స్? (రిజర్వేషన్? అండ్ అలాట్?మెంట్) ఆర్డర్? 1968' నిబంధనల ప్రకారం, ఈ అంశంపై తగు నిర్ణయం తీసుకుంటామని ఈసీ పేర్కొంది. ప్రస్తుతం ఇరువర్గాలు తమదే అసలైన పార్టీ అని చెప్పుకుంటున్నాయి కాబట్టి, దీనిపై తామ్ము ఓ సమగ్ర నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపింది. అందుకే రెండు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడానికి, వారి హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించడానికి, గత సంప్రదాయాలను అనుసరించి ఈ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చినట్లు ఈసీ పేర్కొంది. "అరూప్? రాయ్? (పిటిషనర్?) నేతృత్వంలోని వర్గంగానీ, మమతా బెనర్జీ (ప్రతివాది) నేతృత్వంలోని వర్గం కానీ, ఆల్? ఇండియా తృణమూల్ కాంగ్రెస్ అనే పార్టీ పేరును ఉపయోగించడానికి అనుమతి లేదు. అలాగే ఇంతకు ముందు ఆ పార్టీకి కేటాయించిన పూలు, గడ్డి గర్తును ఉపయోగించడానికి కూడా ఈ రెండు వర్గాలకు అనుమతి ఉండదు" అని కమిషన్ స్పష్టం చేసింది.

### తీవ్రంగా ఖండించిన మమత వర్గం

ఈసీ జారీ చేసిన ఈ ఉత్తర్వులను మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా ఖండించింది. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని పేర్కొంది. మరోవైపు రితబ్రత, అరూప్ రాయ్?ల వర్గం ఈసీ నిర్ణయాన్ని స్వాగతించింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ- మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీపై విమర్శలు గుప్పించింది. "టీఎంసీకి ప్రజల శాపం తగిలింది. గత 15ఏళ్లుగా బంగాల్? ప్రజలపై వారు సాగించిన హింసకు, వేధింపులకు ఇదే సరైన సమాధానం. వారికి ఇలా జరగాల్సిందే" అని ఆ రాష్ట్ర బీజేపీ అధికార ప్రతినిధి దేబ్జిత్ సర్కార్ అన్నారు. బంగాల్ రాష్ట్రంలోని నందిగ్రామ్, రెజీనగర్ అసెంబ్లీ నియోజక వర్గాలకు అక్టోబర్ 6న ఉపఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీ తీసుకున్న తాజా నిర్ణయం మమత వర్గానికి పెద్ద ఎదురుదెబ్బగా భావిస్తున్నారు.

# జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర ముఠా గుట్టురట్టు

జమ్మూకశ్మీర్ పోలీసులు ఓ ఉగ్రవాద ముఠా గట్టురట్టు చేశారు. లష్కరే తోయిబా ఉగ్రవాదులకు ఆశ్రయం, సహాయం అందించిన ముగ్గురు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఒక పిస్టల్, మ్యాగజైన్, మందుగుండు సామగ్రితో పాటు రెండు చైనీస్ గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఉగ్రవాదులకు సహకరిస్తున్న ఈ నెట్వర్క్‌పై దర్యాప్తు ముమ్మరం చేశారు.

తమ దర్యాప్తులో, జమ్మూకశ్మీర్‌లోని రాజౌరీ, కోట్ చార్వార్ ప్రాంతాలకు చెందిన ముగ్గురు వ్యక్తులు లష్కరే తోయిబా ఉగ్రవాదులకు సహకరించినట్లు తేలిందని పోలీసులు తెలిపారు. వీరు ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వడమే కాకుండా, రాజౌరీ-రేసి, పిర్ పంజాల ప్రాంతాల గుండా షోపియాన్ వరకు వారు వెళ్లడానికి సహాయపడ్డారని చెప్పారు. అంతేకాదు నిషేధిత ఎల్ఈటీ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్స్ మాడ్యూల్‌లో ఈ ముగ్గురు అనుమానితులు భాగంగా ఉన్నారని పేర్కొన్నారు. వీరిపై రాజౌరీలోని ధర్మసాల్ పోలీసు స్టేషన్‌లో కేసు (ఎఫ్ఐఆర్ నెం.95/2026) నమోదు చేసినట్లు తెలిపారు. దీనిపై ప్రస్తుతం తాము సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. "ఉగ్రవాదుల మాడ్యూల్‌పై జరిపిన దర్యాప్తులో కీలక విషయాలు తెలిపాయి. కోట్ చార్వాల్‌కు చెందిన మహ్మద్ అజమ్, జాకీర్ హుస్సేన్, మహ్మద్ ముస్తాఖ్ అనే ముగ్గురు వ్యక్తులు నిషేధిత ఉగ్రవాద సంస్థ అయిన లష్కరే తోయిబాకు అనుబంధంగా ఉన్న లాజిస్టిక్ సపోర్ట్ మాడ్యూల్?లో భాగమని తేలింది. 2023లో రియాసిలోని చస్సానాలో జరిగిన ఎన్?కౌంటర్? జరిగింది. అందులో పలువురు ఉగ్రవాదులు హతమయ్యారు. అయితే అంతకుముందు ఆ ఉగ్రవాదులకు ఈ ముగ్గురు నిందితులు సాయం చేయడం, ఆశ్రయం కల్పించడం, వారి కోరుకున్న చోటుకు వెళ్లేందుకు సహకరం అందించారు" అని పోలీసులు తమ అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు.





### ఇద్దరు ఉగ్రవాదులు హతం

కాగా, జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదుల కదలికలపై భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్‌లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఉధంపూర్ జిల్లాలోని మజల్తా ప్రాంతంలోని బ్రెట్టల్ సోహన్, ఖుబ్బన్ అటవీ ప్రాంతాల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. అయితే వారికి పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న జైషే మహమ్మద్ (జీవవీ)తో సంబంధాలున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. సెప్టంబర్ 16 (బుధవారం)న బ్రాటెల్ సోన్, ఖుబ్బన్ అటవీప్రాంతంలో ఉగ్రవాదులు ఉన్నారని పక్కా సమాచారం అందడంతో భద్రతా బలగాలు రంగంలోకి దిగాయి. సుమారు రాత్రి 9 గంటల సమయంలో సైన్యానికి చెందిన వైట్ నైట్ కార్ప్స్, జమ్మూకశ్మీర్ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. నిర్దిష్ట ప్రాంతాన్ని చుట్టుముట్టి గాలింపు ప్రారంభించారు. ఆపరేషన్ మొదలైన కాసేపటికే ఉగ్రవాదుల స్థావరం లక్ష్యంగా భద్రతాబలగాలు కాల్పులు జరిపాయి. పేలుళ్ల శబ్దాలు కూడా అటవీప్రాంతంలో వినిపించాయి. అయితే గురువారం ఉదయం భద్రతా వలయాన్ని తప్పించుకునేందుకు ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో ఇరువర్గాల మధ్య భీకరంగా కాల్పులు కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపాయి. ఈ కాల్పుల్లో ఇప్పటివరకు ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు చెప్పారు. అదనపు బలగాలతో అటవీ ప్రాంతాన్ని నలువైపులా దిగ్బంధించినట్లు తెలిపారు.

### కొనసాగుతున్న సెర్చ్ ఆపరేషన్

అదనపు బలగాలను ఘటనాస్థలికి తరలించి గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఇద్దరు ఉగ్రవాదులు హతమైనప్పటికీ, ప్రాంతంలో మరెవరైనా దాక్కున్నారా అనే కోణంలో ఆపరేషన్ కొనసాగుతోంది. ఆపరేషన్ పూర్తిగా ముగియలేదని సైన్యం స్పష్టం చేసింది. మిగిలిన ముప్పును గుర్తించి నిర్వీర్యం చేసేందుకు భద్రతా బలగాలు ఆ ప్రాంతంలో మోహరించి ఉన్నాయని వైట్ నైట్ కార్ప్స్ తెలిపింది. మరోవైపు జులై 8న ఓ ఎల్?ఈటీ ఉగ్రవాదిని ఎన్?కౌంటర్?లో మట్టుబెట్టాయి. షోపియాన్‌లోని సైద్‌పొరా ప్రాంతంలోని దట్టమైన పండ్ల తోటలో ఇద్దరు ఉగ్రవాదులు నడుచుకుంటూ వెళ్తున్న దృశ్యాలు నిఘా కెమెరాల్లో రికార్డైంది. లష్కరే కమాండర్ జాకీర్ గనాయ్, అతని అనుచరుడు లతీఫ్ భట్ సంచరిస్తున్నట్లు గుర్తించారు. దీంతో జులై 3న షోపియాన్ స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ (ఎస్?ఓజీ), ఆర్మీకి చెందిన రాష్ట్రీయ రైఫిల్స్(ఆర్ఆర్), సీఆర్?పీఎఫ్ దళాలు సంయుక్తంగా ఈ సెర్చ్ ఆపరేషన్?ను ప్రారంభించి ఆ ఉగ్రవాదిని మట్టుబెట్టాయి.

# పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుంది

అరేబియా సముద్రంలో భారత యుద్ధ నౌకను పాకిస్థాన్ నౌక ఢీకొన్న ఘటనకు సంబంధించి ఇస్లామాబాద్ చేసిన ఆరోపణలను భారత్ తిరస్కరించింది. ఈ ఘటనపై పాకిస్థాన్ ఇచ్చిన సమాధానం ఏ మాత్రం సమంజసం కాదని పాక్ ఎప్పుడూ వంకర మాటలే మాట్లాడుతుందని విదేశాంగ శాఖ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఇరుపక్షాల మధ్య ఉన్న సంబంధిత ఒప్పందాల్లోని నిబంధనలను పాటించాలని సూచించారు.

"పాక్ నౌక చేసిన ప్రమాదకరమైన ఓవర్‌టేకింగ్ విన్యాసం, 1991 ఏప్రిల్ నాటి సైనిక విన్యాసాలకు సంబంధించి భారత్, పాక్? ఒప్పందంలోని ఆర్టికల్ 10ను ఉల్లంఘించింది. ఈ ఆర్టికల్ ప్రకారం సముద్రంలో నౌకాదళ విభాగాలు ఒకదానికొకటి మూడు నాటికల్ మైళ్ల పరిధిలో ఉండకూడదు. అంతేకాకుండా, సముద్రంలో నౌకలు ఢీకొనడాన్ని నివారించే అంతర్జాతీయ నిబంధనలను కూడా పాక్? ఉల్లంఘించింది." ఉత్తర అరేబియా సముద్రంలో గస్తీలో ఉన్న 'ఐఎన్ఎస్ కోల్‌కతా' వద్దకు పాకిస్థాన్ నౌక 'పీఎన్ఎస్ హునైన్' ప్రమాదకర రీతిలో దూసుకురావడం వల్లే ఈ ఘటన జరిగిందని విదేశాంగ శాఖ స్పష్టం చేసింది. ఈ ఘటనపై ఇప్పటికే పాకిస్థాన్ చార్జ్ డి అఫైర్స్‌కు భారత్ తీవ్ర నిరసన తెలిపింది. కాగా, ఈ ఘటనలో భారత నౌకకు ఎలాంటి పెద్ద నష్టం వాటిల్లలేదని, అది ప్రస్తుతం సముద్రంలోనే తన విధులను నిర్వర్తిస్తోందని జైస్వాల్ వెల్లడించారు.

### అసలేం జరిగింది?

మంగళవారం రాత్రి, ఉత్తర అరేబియా సముద్రంలో భారత నౌక గస్తీ నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరిగింది. అయితే, ఈ ప్రమాదంలో భారత్‌వైపు ఎలాంటి నష్టం వాటిల్లలేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. పాక్ నౌక హునైన్ క్లాస్‌కు చెందినదని, భారత్‌ది యుద్ధనౌక అని



పేర్కొన్నాయి. ప్రమాద సమయంలో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఘటన తర్వాత రెండు నౌకలు దూరంగా వెళ్లాయని వర్గాలు తెలిపాయి.

### ఎర్ర సముద్రంపై భారత్ ఆందోళన

మరోవైపు ఎర్ర సముద్ర ప్రాంతంలో భద్రతా పరిస్థితి తీవ్రతరం కావడంపై భారత్ మరోసారి ఆందోళన వ్యక్తం చేసింది. పౌరులు, ఆర్థిక ఆస్తులతో పాటు సౌదీ అరేబియా భూభాగాన్ని లక్ష్యంగా చేసుకుని హౌతీలు జరిపిన దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఇలాంటి దాడులు ప్రాంతీయ భద్రతకు విఘాతం కలిగిస్తాయని రణ్‌ధీర్ జైస్వాల్ అన్నారు. హౌతీల దాడులు ప్రాంతీయ శాంతి, భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని తెలిపారు. ముఖ్యంగా బాబ్ అల్ మండబ్ జలసంధి గుండా నౌకాయాన స్వేచ్ఛకు ఇలాంటి పరిస్థితులు ముప్పుగా మారతాయని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో త్వరగా శాంతి, స్థిరత్వం పునరుద్ధరిస్తారని భారత్ ఆశిస్తున్నట్లు చెప్పారు.

### బంగ్లాదేశ్ ఒప్పందాలపై

గత అవామీ లీగ్ ప్రభుత్వం హయాంలో కుదిరిన 101 ద్వైపాక్షిక ఒప్పందాలను ఢాకాలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) నేతృత్వంలోని ప్రభుత్వం సమీక్షిస్తోందన్న వార్తలపైనా విదేశాంగ శాఖ స్పందించింది. ఈ అంశానికి సంబంధించి కొన్ని మీడియా కథనాలను తాము చూశామని జైస్వాల్ తెలిపారు. అయితే బంగ్లాదేశ్ ప్రభుత్వం నుంచి భారత్‌కు అధికారికంగా ఎలాంటి సమాచారం అందలేదని చెప్పారు. భారత్ తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. ద్వైపాక్షిక ఒప్పందాలపై బంగ్లాదేశ్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను భారత్ పరిశీలిస్తుందని తెలిపారు. అధికారికంగా సమాచారం అందిన తర్వాతే దీనిపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు.

### మాల్దీవులకు ఆర్థిక సాయం

మాల్దీవులకు భారత్ అందిస్తున్న అభివృద్ధి, ఆర్థిక సహాయంపై కూడా విదేశాంగ శాఖ వివరాలు వెల్లడించింది. మాల్దీవులు తన 150 మిలియన్ డాలర్ల ట్రెజరీ బిల్ ఫెసిలిటీని పూర్తిగా చెల్లించినట్లు తెలిపింది. ఆ దేశంపై ఉన్న ఆర్థిక ఒత్తిడిని తగ్గించేందుకు భారత ప్రభుత్వం చర్యలు తీసుకుందని వెల్లడించింది. ఇందులో భాగంగా ఐదేళ్ల కాలంలో సుమారు 45 మిలియన్ డాలర్ల వడ్డీ చెల్లింపులను భారత ప్రభుత్వం భరించిందని విదేశాంగ శాఖ పేర్కొంది. మాల్దీవులతో అభివృద్ధి, ఆర్థిక సహకారాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపింది. ప్రాంతీయ స్థిరత్వం, ఆర్థిక సహకారంలో భాగంగా పొరుగు దేశాలకు అవసరమైన సహకారం అందిస్తున్నట్లు వివరించింది.

## నీట్ సంస్కరణలపై నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదిక

నీట్ పరీక్షల్లో నిర్మాణాత్మక సంస్కరణలపై సలహాలు ఇచ్చేందుకు నందన్ నిలేకని నేతృత్వంలో ఏర్పాటైన అత్యున్నత స్థాయి కమిటీ ఈ నెలాఖరుకల్లా తొలి మధ్యంతర నివేదికను సమర్పించే అవకాశం ఉంది. ఈ మేరకు కేంద్రం సుప్రీంకోర్టుకు తెలిపింది. జస్టిస్‌ూరా నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనానికి సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని వెల్లడించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ కె.రాధాకృష్ణన్ నేతృత్వంలోని గత కమిటీ సభ్యులతోనూ నిలేకని ప్యానెల్ విస్తృతంగా చర్చలు జరిపిందని తెలిపారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై అఫిడవిట్ దాఖలు చేయాలని ఇూరా జాయింట్ సెక్రటరీని ఆదేశించింది. ఈ మేరకు రెండు వారాల్లోగా పురోగతిని తెలియజేస్తూ అఫిడవిట్ దాఖలు చేయాలని స్పష్టం చేసింది.

నీట్ పరీక్ష నిర్వహణ కోసం శాశ్వత సిబ్బందితో కూడిన పటిష్టమైన, శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయడమే అత్యంత కీలకమని కోర్టు స్పష్టం చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ చీూా కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన కేంద్రాన్ని తాము స్వయంగా సందర్శించి వ్యవస్థను పరిశీలిస్తామని న్యాయమూర్తులు పేర్కొన్నారు. "వ్యవస్థ సరిగ్గా పనిచేస్తుందో లేదో, సిబ్బంది ఎలా ఉన్నారో చూడటానికి మేమే ఒక రోజు అక్కడికి వస్తాము. మొత్తం వ్యవస్థకు శాశ్వతత్వం ఉండటమే కీలకం అని మీరు తెలుసుకోవాలి. ఒక శాశ్వత స్థలం, శాశ్వత ఏర్పాట్లు ఉండాలి. కనీసం సగం మంది సిబ్బంది అయినా అక్కడ ఉండాలి. అందరూ డిప్యూటేషన్‌పై వచ్చినవారు కాకూడదు. శాశ్వత సిబ్బంది ఉండాలి. అప్పుడే ఒక శాశ్వత నిర్మాణం ఏర్పడుతుంది. జాతీయ పరీక్షల ఏజెన్సీ (ఎన్‌టీఏ) కొత్తగా ఆధునీకరించిన కేంద్రాన్ని సందర్శించి, అక్కడి వ్యవస్థను పరిశీలించాలని తాము భావిస్తున్నాం." అని ధర్మాసనం చెప్పింది. ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్ (ఫైమా) తరపున న్యాయవాది తన్వి దుబే దాఖలు చేసిన పిటిషన్‌తో సహా పలు పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ క్రమంలోనే ఆగస్టు 19న విచారించిన సుప్రీం, ఎన్‌టీఏలో సంస్కరణలను సంస్థాగతం చేయాల్సిన అవసరం ఉందని గమనించింది. ఇందుకోసం రాధాకృష్ణన్ ప్యానెల్, నీలేకని కమిటీ సిఫార్సులను అమలు చేయడానికి తీసుకున్న చర్యల గురించి తమకు తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. అంతకుముందు నీట్ ప్రశ్నపత్రం లీకేజీ దుమారం రేపిన వేళ కేంద్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యల్లో భాగంగా పరీక్షా విధానంలో సంస్కరణలపై సిఫార్సులకు కమిటీని ఏర్పాటు చేసింది. ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకుడు నందన్ నీలేకని నేతృత్వంలో హైపవర్డ్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రధాని మోదీ వెల్లడించారు. ఇందులో నందన్ నీలేకనితో పాటు మరో ఐదుగురు ఈ టాస్క్ ఫోర్సులో సభ్యులుగా నియమించారు. ఇస్రో మాజీ ఛైర్మన్ యస్. సోమనాథ్, ఇంటెలిజెన్స్ బ్యూరో మాజీ డైరెక్టర్ తపన్ డేకా, ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి. కామకోటి, కేంద్ర విద్యాశాఖ మాజీ కార్యదర్శి అనితా కర్వాల్, లాజిస్టిక్స్, పరిపాలనా నిపుణుడు అమృత్ లాల్ మీనా ఉన్నారు.

### ప్రధాన బాధ్యతలు

చీూా పరీక్ష వ్యవస్థను పునర్వ్యవస్థీకరించడం పరీక్షల్లో సాంకేతిక భద్రతను బలోపేతం చేయడం పేపర్ లీకులు, మాల్‌ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు కొత్త వ్యవస్థలు రూపొందించడం పరీక్షల నిర్వహణలో నిర్మాణాత్మక సంస్కరణలు సూచించడం డిజిటల్ భద్రత, అభ్యర్థుల ధ్రువీకరణ, డేటా రక్షణకు అత్యాధునిక సాంకేతిక పరిష్కారాలు సిఫార్సు చేయడం భవిష్యత్తులో జాతీయ స్థాయి పరీక్షలు పారదర్శకంగా, విశ్వసనీయంగా నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం

## నందిగ్రామ్ ఉపఎన్నికల్లో 'దీదీ'కి షాక్

బంగాల్ రాజకీయాల్లో ఊహించని పరిణామం జరిగింది. ఉపఎన్నికలు జరగనున్న వేళ మమతా బెనర్జీకి ఎదురుదెబ్బ తగిలింది. నందిగ్రామ్ అసెంబ్లీ ఉపఎన్నిక బరిలో నుంచి బంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వర్గం అభ్యర్థి సంచిత ప్రధాన్ దేవ్ అనూహ్యంగా తప్పుకున్నారు. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడానికి ఒక్క రోజు ముందు ఆమె తన నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. తమ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరించుకున్న నేపథ్యంలో, నందిగ్రామ్ ఉపఎన్నికలో కాంగ్రెస్?కు తాము పూర్తి మద్దతు ఇస్తామని మమత ప్రకటించారు. తన వర్గం అభ్యర్థి పోటీ నుంచి తప్పుకున్న కొద్ది గంటలకే ఆమె ఈ ప్రకటన చేశారు. ఈ పరిస్థితుల్లో రాహుల్ గాంధీ, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తనకు సంఘీభావం ప్రకటించారని వెల్లడించారు. తామంతా కలిసికట్టుగా బీజేపీపై పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నికల కోసం మమతా నేతృత్వంలోని వర్గానికి 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' అనే పేరును 'ఫుట్‌బాల్ ప్లేయర్' గుర్తును ఎన్నికల సంఘం శుక్రవారం కేటాయించింది. అదే సమయంలో ప్రత్యర్థి అరూప్ రాయ్ నేతృత్వంలోని వర్గానికి 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరు 'ఎన్వలప్' (కవరు) గుర్తును కేటాయించింది. టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తు విషయంలో ప్రత్యర్థి వర్గాల మధ్య తీవ్ర వివాదం నడుస్తున్న తరుణంలో ఎన్నికల సంఘం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. అయితే, తృణమూల్ కాంగ్రెస్‌కు సాంప్రదాయంగా ఉన్న ఎన్నికల గుర్తును తొలగించడాన్ని మమతా బెనర్జీ వర్గం తీవ్రంగా ఖండించింది. ఈసీ నిర్ణయం వెలువడిన కొన్ని గంటల్లోనే సంచిత ప్రధాన్ దేవ్ తన నామినేషన్ ఉపసంహరించుకోవడం బంగాల్ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.


### అసలేం జరిగింది?

నందిగ్రామ్ నుంచి మమతా వర్గం తరఫున బరిలోకి దిగిన సంచిత ప్రధాన్ దేవ్ తన భర్త సత్యజిత్‌తో కలిసి బంగాల్ సచివాలయం 'నబన్న'కు వెళ్లారు. అక్కడ సీఎం సువేందు అధికారితో భేటీ అయ్యారు. సమావేశం ముగిసిన వెంటనే ఆమె తన నామినేషన్ పత్రాలను ఉపసంహరించుకున్నారు. దీంతో ఉపఎన్నికలో నందిగ్రామ్ నియోజకవర్గంలో 'మమతా ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్' వర్గానికి అభ్యర్థి లేకుండా పోయారు.

### 'ప్రతిపక్షాలను విచ్ఛిన్న చేయడమే బీజేపీ లక్ష్యం'

మరోవైపు, ఈ పరిణామాలపై మమతా బెనర్జీ తీవ్రంగా స్పందించారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్షాలను విచ్ఛిన్న చేయడం, బలహీనపరచడమే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుందని మమత ఆరోపించారు. అలాగే, 28 ఏళ్లుగా ఉన్న తమ పార్టీ అధికారిక గుర్తును ఈసీ ఏ విధంగా స్తంభింపజేస్తుందని ప్రశ్నించారు. ఆ పరిణామాన్ని "ప్రజాస్వామ్యానికి చీకటి రోజు"గా మమతా అభివర్ణించారు. 'గత 28 ఏళ్లుగా, అంటే ఆరంభం నుంచి తమ వద్ద ఉన్న గుర్తును వారు (ఈసీ) ఎలా స్తంభింపజేయగలరు?' అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో టీఎంసీలోని తిరుగుబాటు నేతలు బీజేపీకి పనిచేస్తున్నారని విమర్శలు గుప్పించారు. కేవలం బంగాల్‌లోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లో కూడా ఎన్నికలను అపహాస్యం చేసిందని ఆరోపించారు. నిన్నటి దాకా తమ పార్టీ గుర్తుపై ఎన్నికై గెలిచిన వారే నేడు అదే గుర్తును సవాల్ చేయడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహారాష్ట్రలోని రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ, "ముందు ఉద్ధవ్ ఠాక్రే పార్టీని, ఆ తర్వాత ఎన్సీపీని విచ్ఛిన్నం చేశారు. ఇప్పుడు మాపై పడ్డారు. టీఎంసీ పేరు, దాని గుర్తును నిలవనివ్వనని సువేంధు అధికారి గతంలోనే చెప్పారు. కానీ, వాళ్లు ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ వారికి మేం తలవంచం" అని మమతా ఆరోపించారు. కాబట్టి, నందిగ్రామ్‌లో కాంగ్రెస్ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని, 'ఇండి కూటమిని బలోపేతం చేయడానికి' తమ పార్టీ నిర్ణయించిందని మమత స్పష్టం చేశారు.

## మోదీకి యూఏఈ అధ్యక్షుడు ఫోన్



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడు షేక్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్ భారత ప్రధాని నరేంద్ర మోదీకి శుక్రవారం రోజు ఫోన్ చేసి మాట్లాడారు. ప్రధాని మోదీ 76వ పుట్టిన రోజు (సెప్టెంబర్ 17) సందర్భంగా ఆయనకు యూఏఈ అధ్యక్షుడు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఫోన్ కాల్‌లో ఇరువురు నేతలు పశ్చిమాసియా ప్రాంత పరిణామాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఇదే సమయంలో భారత్- యూఏఈ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే అంశాలపైనా చర్చించారు. ఈ మేరకు భారత ప్రధాన మంత్రి కార్యాలయం (ూమీూ) ఒక అధికారిక ప్రకటనలో పేర్కొంది. మోదీ గురువారం రోజు 76వ ఏట అడుగుపెట్టిన సందర్భంగా ఇరు నేతల మధ్య ఈ ప్రత్యేక సంభాషణ జరిగింది. పీఎంఓ ప్రకారం, ఈ సంభాషణ సందర్భంగా పశ్చిమాసియాలోని తాజా పరిస్థితులపై ఇరువురు నేతలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, భద్రత, స్థిరత్వాన్ని ప్రోత్సహించడానికి అవసరమైన అన్ని ప్రయత్నాలలో తమ నిరంతర సహకారం, సమన్వయాన్ని కొనసాగించడానికి కట్టుబడి ఉన్నట్లు నేతలు పునరుద్ఘాటించారు.

# 22ఏ భూముల సమస్యలకు చెక్!

22ఏ నిషేధిత భూములతోపాటు ఇతర భూసంబంధిత సమస్యల పరిష్కారం దిశగా ప్రభుత్వం కీలక అడుగేసింది. ఈ మేరకు ముగ్గురు ఉన్నతాధికారులతో కూడిన హైలెవల్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ ఉన్నత స్థాయి కమిటీకి సీసీఎల్ఏ కమిషనర్ లోకేశ్? కుమార్?ను ఛైర్మన్‌గా నియమించింది. న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డి, స్టాంప్స్, రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్ రాజీవ్?గాంధీ హనుమంతులను సభ్యులుగా ఉండనున్నారు. దీంతోపాటు 118 జీవో బాధితులకు ప్రభుత్వం ఉపశమనం కల్పిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా ఎల్బీనగర్‌లో 9,700 ప్లాట్ల రెగ్యులరైజేషన్?కు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది.



**వారికి రేపటి నుంచి పట్టాల పంపిణీ**

భూ సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణ ప్రణాళికకు అనుగుణంగా ముందుకెళ్తోంది. దీంతో ఇతర భూసంబంధిత సమస్యలనూ వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని ప్రకారం ఎల్బీనగర్‌లో జీవో నంబర్118 కింద అందిన దరఖాస్తులను నెల రోజుల్లోగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయం వల్ల ఆయా కాలనీల్లో నివసిస్తున్న 9,700కు పైగా కుటుంబాలకు ప్రయోజనం చేకూరుతుందని ప్రభుత్వం పేర్కొంది. ఈ క్రమబద్ధీకరణ ప్రక్రియ శనివారం నుంచే ప్రారంభమవుతుందని తెలిపింది. ఈ రెగ్యులరైజేషన్ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

"ముఖ్యమంత్రి రేవంత్?ండ్డి ప్రకటించిన 12 అంశాల కార్యాచరణను 30 రోజుల్లో పరిష్కరించే దిశగా ముందుకెళు_న్నాం. ఇందులో భాగంగా ఇవాళ మెమో జారీ చేశాం. 22ఏ కారణంగా ఎవరైతో ఇబ్బంది పడుతున్నారో, ఏ జీవో వల్ల రెగ్యులరైజేషన్ ఇతరత్రా పెండింగ్?లో ఉన్నాయో వాటిని పరిష్కరిస్తున్నాం. 22ఏలో భాగంగా కొన్ని పనులు ఇప్పటికే కార్యరూపం దాల్చాయి. అందులో జీవో నంబర్ 118 కింద ఎల్బీనగర్లో 9,792 మంది ప్లాట్లు రెగ్యులరైజ్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. అక్కడి భూములకు సంబంధించి ఆ భూ యజమానులకు రేపటి నుంచే పట్టాల పంపిణీ చేయనున్నాం"

**సింగరేణి ఇళ్ల స్థలాలపై రేపే జీవో విడుదల**

సింగరేణి కాలనీ పరిధి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలను కూడా పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఈ మేరకు అక్కడ జిల్లా స్థాయి కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ఈ మేరకు తగిన కార్యాచరణను రూపొందిస్తామన్నారు. ఇందుకు సంబంధించి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పరిశ్రమల మంత్రి శ్రీధర్?బాబుతో ఇవాళ చర్చలు జరిపి, రేపే జీవోను విడుదల చేస్తామని ప్రకటించారు.

అదే సమయంలో సెక్షన్ 22ఏ కారణంగా హెచ్?ఎండీఏ, జీహెచ్ఎంసీ లేదా డీటీసీపీ వంటి సంబంధిత అధికారుల ద్వారా ఆమోదం పొందినప్పటికీ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయిన లేఅవుట్లను క్రమబద్ధీకరించే ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్లుగా ఈ లేఅవుట్లు రెగ్యులరైజేషన్? ఒకటి రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని మంత్రి పొంగులేటి శాసనసభ వేదికగా వెల్లడించారు.

# ఆర్టీసీలో ఎన్నికల నగారా

-మొదటిపేజీ తరువాయి

ప్రారంభం కానుంది. అక్టోబర్ 9న ఎన్నికలు జరుగుతాయని, అక్టోబర్ 26న తుది ఓటరు జాబితాను అన్ని జిల్లాల్లో విడుదల చేయనున్నట్లు నోటిఫికేషన్?లో పేర్కొన్నారు. చివరగా అక్టోబర్ 17న ఫలితాలు వెల్లడిస్తామని అధికారులు ప్రకటించారు. కాగా ఆర్టీసీలో చివరిసారిగా 2016 జులై 19న గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగాయి.

ఆర్టీసీలో అనేక కార్మిక యూనియన్లు ఉన్నప్పటికీ ఎన్నికల్లో గెలిచిన వాటిని మాత్రమే గుర్తింపు సంఘంగా పరిగణిస్తారు. ఈ గుర్తింపు పొందిన యూనియన్లు రీజియన్, రాష్ట్ర స్థాయిల్లో పనిచేస్తాయి. ఈ రెండింటి ఎన్నికలకు కూడా వేర్వేరు బ్యాలెట్ పత్రాలను ఉపయోగిస్తారు. కార్మికుల వేతనాలు, బోనస్‌లు, కరవు భత్యం(డీఏ), సర్వీస్ నిబంధనలు, తదితర అంశాలపై సంస్థ యాజమాన్యం సర్కారుతో చర్చలు జరిపే చట్టపరమైన హక్కు ఈ గుర్తింపు సంఘాలకే ఉంటుంది. కార్మికుల తరపున ఒప్పందాలు కుదుర్చుకోవడంలో కూడా గుర్తింపు సంఘాలు కీలక పాత్ర పోషిస్తాయి. రీజియన్?లో పనిచేసే అధికారి స్థాయి మినహాయించి మిగిలిన ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులందరూ ఓటు వేయడానికి అర్హులు.



**ప్రచారం ప్రారంభించిన సంఘాలు**

వాస్తవానికి ఈ ఎన్నికలు 2018లోనే జరగాల్సి ఉన్నప్పటికీ అప్పటి ప్రభుత్వం వీటిని నిర్వహించలేదు. అయితే ఈసారి దాదాపు 48 వేల మంది ఆర్టీసీ ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. గుర్తింపు సంఘం ఎన్నికలను పురస్కరించుకుని ఇప్పటికే పలు కార్మిక సంఘాలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. కార్మికుల సమస్యలు, వేతన సవరణ, ఉద్యోగ భద్రత వంటి అంశాలే ప్రధాన ఎజెండాగా మారాయి. ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కార్మిక శాఖ అన్ని ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది.

**ఆర్టీసీ సంఘాల ఎన్నికల పూర్తి షెడ్యూల్ ఇదే**

సెప్టెంబర్ 18: ఎన్నికల షెడ్యూల్ విడుదల
సెప్టెంబర్ 21: ఎన్నికల్లో పోటీ చేయడానికి సంఘాల సమ్మతి
సెప్టెంబర్ 22: యూనియన్లకు ఓటర్ ?లిస్ట్ అందించడంతో పాటు అభ్యంతరాల స్వీకరణ ప్రారంభం
సెప్టెంబర్ 24: ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు దాఖలు చేసే అవకాశం
సెప్టెంబర్ 25: సంఘాలకు తుది ఓటర్ల జాబితా అందజేత
సెప్టెంబర్ 26: యూనియన్లకు ఎన్నికల గుర్తుల కేటాయింపు, రిటర్నింగ్ అధికారికి తుది ఓటర్ల జాబితా అప్పగింత
సెప్టెంబర్ 29: యూనియన్లకు నమూనా బ్యాలెట్ పత్రాల సమర్పణ
అక్టోబర్ 09: ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్
అక్టోబర్ 14, 15: పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటింగ్
అక్టోబర్ 17: ఫలితాల వెల్లడి

# దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురు

దానం నాగేందర్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో దానంపై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు తీర్పు వెలువరించింది. బీఆర్ఎస్? ఎమ్మెల్యేగా ఉంటూనే కాంగ్రెస్ తరఫున సికింద్రాబాద్ నుంచి లోక్‌సభకు పోటీ చేయడం చట్టవిరుద్ధమని హైకోర్టు తేల్చిచెప్పింది. లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసిన నాటి నుంచే ఎమ్మెల్యేగా అనర్హుడని స్పష్టం చేసింది.

ఫిరాయింపు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు హైకోర్టులో చుక్కెదురైంది. స్పీకర్ ట్రైబ్యునల్ ఇచ్చిన తీర్పును రద్దు చేసి అనర్హతా వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన వేర్వేరు పిటీషన్లపై హైకోర్టు ఈ మేరకు ఉత్తర్వులు వెలువరించింది. ఇద్దరి పిటీషన్లపై హైకోర్టులో ఆగష్టు 21వ తేదీన వాదనలు ముగిశాయి. సెప్టెంబర్ 16వ తేదీన ఉత్తర్వులు వెలువరించాల్సి ఉన్నప్పటికీ తీర్పు కాపీలు సిద్ధం కాకపోవడంతో సీజే ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు వెలువరించింది. ఈ రెండు పిటిషన్లపై హైకోర్టు సుదీర్ఘ విచారణ నిర్వహించింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీ టికెట్ పై లోక్ సభ ఎన్నికల్లో పోటీ చేశారని పాడి కౌశిక్ రెడ్డి తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో ఉన్న పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం దానంపై అనర్హతా వేటు వేయాలని వాదించారు.



**దానంపై అనర్హత వేటు వేసిన హైకోర్టు**

స్పీకర్ సరైన నిర్ణయం తీసుకోకపోతే నేరుగా జోక్యం చేసుకొని ఎమ్మెల్యేపై వేటు వేసే అధికారం హైకోర్టుకు ఉందని వాదనలు వినిపించారు. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని గతంలో సుప్రీంకోర్టు కూడా పేర్కొందని వాదించారు. దానం నాగేందర్ బీఆర్ఎస్?కు రాజీనామా చేయకపోయినా ఆయన కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేయడంతోనే సహజంగా సభ్యత్వం పోయినట్లేనని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తరపు న్యాయవాది వాదించారు. దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేసి పార్టీ మారినప్పటి నుంచి ఆయనకు శాసనసభ నుంచి అందిన జీతభత్యాలను తిరిగి చెల్లించేలా ఆదేశించాలని వాదించారు.

దానంపై స్పీకర్ ట్రైబ్యునల్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ సరైన ఆధారాలు లేవంటూ స్పీకర్ ట్రైబ్యునల్ ఎలాంటి చర్యలు చేపట్టకుండా మార్చి 11వ తేదీన జారీ చేసిన ఉత్తర్వులు రద్దు చేయాని కోరారు. దానం ఇప్పటికీ బీఆర్ఎస్?లోనే ఉన్నారని శాసనసభలోనూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగానే కొనసాగుతున్నారని ఆయన తరపు న్యాయవాది వాదించారు. పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని నియోజకవర్గ అభివృద్ధి కోసమే సీఎం రేవంత్‌రెడ్డిని దానం కలిశారని వాదించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన ఫోటోలను చూసి.. అపోహతోనే పిటీషన్లు దాఖలు చేశారని దానం తరపు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు తీర్పును రిజర్వు చేసి ఉత్తర్వులు వెలువరించింది. దానంపై అనర్హతా వేటు వేస్తూ ఉత్తర్వులు వెలువరించింది.

**హైకోర్టు తీర్పుపై స్పందించిన దానం నాగేందర్**

హైకోర్టు తీర్పుపై దానం నాగేందర్ స్పందించారు. హైకోర్టు తీర్పును గౌరవిస్తున్నానని తెలిపారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ఆలోచన లేదని ఆయన వివరించారు. ప్రజాక్షేత్రంలోనే, ఎన్నికల్లోనే పోరాడతామన్నారు. ఎన్నికల్లో పోరాడటం తనకు కొత్త కాదని దానం వివరించారు. పోరాటాలు చేసి ఈ స్థాయికి వచ్చినవాడినని తెలిపారు.

**మిగిలిన 8 మందిపైనా అనర్హతవేటు పడేవరకు పోరాటం**

దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పందించారు. సత్యమేవ జయతే అంటూ ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్?లో ట్వీట్ చేశారు. పార్టీ ఫిరాయించిన మిగితా వారికీ ఇదే పరిస్థితి పడుతుందన్నారు. ఇదే అంశంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పందించారు. బీఆర్ఎస్ పార్టీకి విజయం లభించిందన్నారు. అమ్ముడుపోతే అనర్హత తప్పదని తాము గతంలోనే చెప్పామన్న కౌశిక్ రెడ్డి, హైకోర్టు తీర్పు కాంగ్రెస్ పార్టీకి చెంపదెబ్బ అని పేర్కొన్నారు. మిగిలిన 8 మందిపైనా అనర్హత వేటు పడేవరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. ఉపఎన్నికలో బీఆర్ఎస్? పార్టీ జెండా ఎగరవేస్తుందని కౌశిక్?రెడ్డి తెలిపారు. అధికారం ఉందని విర్రవీగితే ఎదురుదెబ్బలు తప్పవని అన్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేలు ఏ పార్టీలో ఉన్నారో.. చెప్పుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు.

## 'మాకు మరో 9.56 లక్షల ఇళ్లు కేటాయించండి'

-మొదటిపేజీ తరువాయి

కేంద్రమంత్రికి వివరించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల వ్యవసాయంలో విద్యుత్ వినియోగం పెరిగిందని, ఎల్‌నినో నేపథ్యంలో తాగు నీరు, విద్యుత్ కొరత లేకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు కేంద్రం సహకారం ఇవ్వాలని కోరారు.

**తెలంగాణలో సన్నబియ్యం పంపిణీ చేస్తున్నాం**

దేశంలో ఎక్కడా లేని విధంగా పేదలకు తెలంగాణలో సన్నబియ్యాన్ని విజయవంతంగా పంపిణీ చేస్తున్నట్లు సీఎం తెలిపారు. సన్నవడ్లకు రూ.500 బోనస్?ను రైతులకు అందించి ప్రోత్సహిస్తున్నట్లు కేంద్రమంత్రికి వివరించారు. ఎల్‌నినో నేపథ్యంలో రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. 250 ఎకరాల్లో పండ్లు, కూరగాయల మార్కెట్ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. పంట మార్పిడిపై రైతులను ప్రోత్సహించేందుకు సహకారం అందించాలని శివరాజ్‌సింగ్‌ను సీఎం కోరారు.

**హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం**

హైదరాబాద్‌లో దక్షిణాది రాష్ట్రాల వ్యవసాయ శాఖ మంత్రుల సమావేశం జరుగుతండటంతో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ హైదరాబాద్‌కు వచ్చారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, అచ్చెన్నాయుడు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## తెలంగాణపై ఎల్‌నినో ప్రభావం

-మొదటిపేజీ తరువాయి

కంటే తక్కువ నీటి నిల్వలు ఉన్నాయని తెలిపారు. కృష్ణా బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్ కంటే తెలంగాణే ఎక్కువ నీటిని వినియోగించుకుందని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు.

**సాగునీటి కంటే తాగునీటికి తొలి ప్రాధాన్యం**

ఎల్‌నినో పరిస్థితుల దృష్ట్యా సాగునీటి కంటే తాగునీటికి ప్రభుత్వం తొలిప్రాధాన్యమిస్తోందని మంత్రి సీతక్క వెల్లడించారు. తాగునీటి అవసరాలు తీరాకే సాగుకు నీటిని విడిచిపెడుతున్నామన్నారు. అందుబాటులో ఉన్న 34 జలాశయాల్లో ఉన్న నీటిని తాగునీటి కోసం జాగ్రత్తగా వాడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఎల్?నినో ప్రభావం ఎక్కువగా ఉన్న తెలంగాణను కేంద్రం ఆదుకోవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. విపత్కర పరిస్థితుల్లో రాజకీయాలు పక్కనబెట్టి, రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కరవు నివారణకు చర్యలు తీసుకోవాల్సిన ప్రభుత్వం ప్రతిదానికి ఎల్‌నినో పేరు అని చెప్పి తప్పించుకునేందుకు చూస్తోందని ఆక్షేపించారు.

**కేంద్రం చొరవ తీసుకోవాలి**

గత ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో లక్ష కోట్లు దుబారా చేయకుండా మిగతా ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే, ఇప్పటికే తెలంగాణ సస్యశ్యామలంగా ఉండేదని మంత్రి ఉత్తమ్ స్పష్టంచేశారు. రాజకీయాలకు పోకుండా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీ రిపేర్లు చేస్తున్నామన్న మంత్రి, వచ్చే వర్షాకాలం నాటికి వాటిని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. తుమ్మిడిహెట్టి నిర్మాణానికి మహారాష్ట్రను ఒప్పించేలా కేంద్రం చొరవ తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కోరారు.

## ఎరక్కపోయి... ఇరుక్కుపోయిన గులాబీ



**హైదరాబాద్ :** రాజకీయాల్లో ప్రత్యర్థిని ఇరుకున పెట్టేందుకు వేసే ప్రతి వ్యూహం ఆచితూచి ఉండాలి. ఏమాత్రం గురి తప్పినా లేదా మన రికార్డుల్లోనే లోపాలున్నా.. అది కాస్తా రివర్స్ అయి స్వయంకృతాపరాధంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణలో భారత్ రాష్ట్ర సమితి పరిస్థితి అచ్చం చెట్టు కొట్టి నెత్తిన వేసుకున్నట్లే తయారైంది. రిజిస్ట్రేషన్ల శాఖలో నిషేధిత జాబితా అంశాన్ని పట్టుకుని, రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది ప్రజల ఆస్తులు ప్రమాదంలో పడ్డాయంటూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించాలని బీఆర్ఎస్ అగ్రనాయకత్వం భావించింది. దాదాపు కోటి ఎకరాలకు పైగా భూములు 22ఏ జాబితాలోకి వెళ్లాయని తీవ్రస్థాయి ప్రచారం చేసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఆత్మరక్షణలోకి నెట్టాలని చూసింది. ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని వేసిన ఎత్తుగడ చివరకు తమ మెడకే చుట్టుకున్నట్లయింది గులాబీ పార్టీ పరిస్థితి. సాంకేతిక కారణాలతో రిజిస్ట్రేషన్ల శాఖలో సెక్షన్ 22ఏ కింద నమోదైన కొన్ని భూముల సమస్యను పట్టుకుని, కాంగ్రెస్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ప్రజావ్యతిరేకతను మూటగట్టాలని బీఆర్ఎస్ తీవ్ర ప్రయత్నం చేసింది. ప్రభుత్వం ప్రజల ఆస్తులను లాక్కుంటోందంటూ క్షేత్రస్థాయిలో భయాందోళనలు సృష్టించేందుకు పార్టీ శ్రేణులు వ్యూహాత్మకంగా ముందుకొచ్చాయి. అయితే, ప్రభుత్వం ఎదురుదాడి చేయకుండా అత్యంత వేగంగా స్పందించడంతో బీఆర్ఎస్ వేసిన తొలి అడుగులోనే పట్టు తప్పింది. సాంకేతిక లోపం వల్ల కొద్దిమంది రైతులు, భూయజమానులకు మాత్రమే ఈ ఇబ్బంది ఎదురైందని గుర్తించిన రేవంత్ రెడ్డి సర్కార్, ఏమాత్రం మొండిపట్టుకు పోకుండా బహిరంగంగా వివరణ ఇచ్చింది. సంబంధిత శాఖ మంత్రి ప్రజలకు అసౌకర్యం కలిగినందుకు చింతిస్తూ, రికార్డులను వెంటనే సరిచేయాలని అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. రోజుల వ్యవధిలోనే సమస్య పరిష్కారం కావడంతో రైతులు, సామాన్యుల్లో ఆందోళన సద్దుమణిగింది. దీంతో ప్రభుత్వాన్ని కార్నర్ చేయాలన్న ప్రధాన ప్రతిపక్షం వ్యూహం ప్రజల్లో పెద్దగా పనిచేయకుండా పోయింది. సమస్య పరిష్కారమైనా బీఆర్ఎస్ నాయకులు అదే అంశాన్ని పదేపదే ప్రస్తావిస్తూ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకోవడంతో, కాంగ్రెస్ నాయకత్వం రక్షణాత్మక ధోరణి వీడి తీవ్ర ఎదురుదాడికి దిగింది. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అమల్లోకి తెచ్చిన ధరణి పోర్టల్ వెనుక జరిగిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు, కొందరు పెద్దలకు అనుకూలంగా జరిగిన మార్పుల చిట్టాను ప్రభుత్వం బయటపెట్టడం ప్రారంభించింది. ధరణి రూపకల్పన, నిర్వహణలో ఉన్న లొసుగులను రేవంత్ రెడ్డి వరుస ఆధారాలతో ప్రజల ముందుంచడంతో రాజకీయ విమర్శల దిశ ఒక్కసారిగా మారిపోయింది. ఈ పరిణామాల క్రమంలోనే కేసీఆర్ కుటుంబానికి చెందిన వ్యవసాయ క్షేత్రాలు, స్థిరాస్తుల విస్తరణ, వాటి రికార్డుల నమోదుపై ప్రభుత్వం తీవ్రస్థాయి ఆరోపణలు గుప్పించింది. అధికారంలో ఉన్న సమయంలో ఆస్తుల సమీకరణ ఎలా జరిగింది, ధరణి నిబంధనలు వీరికి ఎలా అనుకూలంగా మారాయనే అంశాలపై లెక్కలు బయటకు తీయడంతో వ్యవహారం వ్యక్తిగత ఆస్తుల వివాదంగా మారింది. దీంతో ప్రస్తుతం రాష్ట్ర రాజకీయాల్లో సామాన్యుల 22ఏ భూముల కంటే కేసీఆర్ కుటుంబ భూములు, ఫామ్‌హౌస్‌లు, వాటి చట్టబద్ధతపైనే విస్తృత చర్చ మొదలైంది. ప్రజా సమస్యలపై పోరాడి మైలేజ్ పొందాలనుకున్న బీఆర్ఎస్, అంతిమంగా తమ సొంత రికార్డులపైనే ప్రశ్నలు లేవనెత్తే పరిస్థితి తెచ్చుకుంది. కాంగ్రెస్ సర్కార్‌ను ఇరుకున పెడతామనుకున్న ప్రయత్నం కాస్తా, గత పదేళ్ల నిర్ణయాలు మరియు అధినేత ఆస్తులపై ప్రజాక్షేత్రంలో విచారణ తరహా చర్చకు దారితీసింది. రాజకీయంగా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచబోయి, తామే చెట్టు కొట్టి మీద వేసుకున్న చందంగా బీఆర్ఎస్ ఆత్మరక్షణలో పడిపోయింది.

## సంపాదకీయం

# పొంచి ఉన్న హిమముంపు

హిమాలయాలు ఒక విశాలమైన సహజ జల వ్యవస్థ. దీని కారణంగా ప్రవహిస్తున్న నదులు దక్షిణాసియాలోని వందల మిలియన్ల కొద్ది ప్రజలకు జీవనాధారంగా ఉన్నాయి. హిమానీనదాలు వేగంగా కరుగుతుండటం, అలా కరిగిన నీటితో ఏర్పడిన సరస్సులు, అస్థిరంగా మారుతుండటం, మరోవైపు పర్వత ప్రాంతాలపై పర్యవేక్షణాలోపం కారణంగా హిమాలయాలు ప్రమాదకర దశకు చేరుకుంటున్నాయని తాజా పరిశోధన తెలిపింది.నేపాల్, టిబెట్‌లో 1,300 మందికి పైగా ప్రాణాలు కోల్పోయి, భారీ విధ్వంసం సంభవించిన వరదల తర్వాత ఈ వివరాలు వెలుగులోకి వచ్చాయి. హిమాలయ పర్యావరణ వ్యవస్థలో వేగంగా వస్తున్న మార్పుల కారణంగా ఏ స్థాయిలో ముప్పు పెరుగుతోందో ఈ పరిశోధనా ఫలితాలు తెలిపాయి.గ్లోబల్ కన్సల్టెన్సీ సిస్టమిక్ రిపోర్ట్ ప్రకారం, హిమాలయాల్లోని హిమానీనదాలు దశాబ్దం కిందటితో పోలిస్తే ఇప్పుడు 65 శాతం వేగంగా ద్రవ్యరాశిని కోల్పోతున్నాయి. ఈ నివేదికను ఇంటిగ్రేటెడ్ మౌంటైన్ ఇనిషియేటివ్ రూపొందించింది. దీనికి ఐసీఐఎంవోడీ, జీబీ పంత్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ సాంకేతిక సహకారం అందించాయి. హిమాలయ-కారాకోరం ప్రాంతంలో 40వేల హిమానీనదాలు ఉన్నట్లు అంచనా వేయగా, వాటిలో కేవలం 21 హిమానీ నదాలను మాత్రమే నిరంతరం,సమగ్రంగా పర్యవేక్షిస్తున్నారని రిపోర్టు చెబుతోంది. ఈ పర్యవేక్షణ లోటు ఆందోళన కలిగించే విషయమే. ఎందుకంటే హిమాలయాల భౌగోళిక స్వరూపం వేగంగా మారిపోతోంది.హిమానీనదాలు కరిగి వెనక్కి తగ్గుతున్న కొద్దీ, వాటి వెనుక పెద్ద పెద్ద సరస్సులు ఏర్పడుతున్నాయి. వీటిని రాళ్లు, మంచుతో కూడిన అస్థిరమైన సహజ అడ్డంకులు నిలువరించి ఉంచుతున్నాయి. సమయంలో ఉష్ణోగ్రతలు పెరగడంతో పెర్మాఫ్రాస్ట్ , అంటే శాశ్వతంగా గడ్డకట్టిన నేల క్రమంగా కరిగి అస్థిరంగా మారుతోంది. ఎత్తైన పర్వత వాలు కూడా బలహీనపడుతోంది. దీని వల్ల ఒక ప్రమాదం మరో ప్రమాదానికి దారితీసే అవకాశం పెరుగుతోందని ఈ రిపోర్టు చెబుతోంది. ఈ ముప్పు స్థాయి ఎంత ఉంటుందో భారత్ వద్ద ఇప్పటికే ఆధారాలు ఉన్నాయి.భారత్ భూభాగంలో సుమారు 18 శాతం హిమాలయ ప్రాంతమే ఉన్నప్పటికీ, దేశంలో సంభవించే విపత్తుల్లో దాదాపు 35 శాతం ఈ ప్రాంతంలోనే జరుగుతున్నాయని నివేదిక చెబుతోంది.2025లో భారత హిమాలయ ప్రాంతంలోని అధికప్రమాదం ఉన్న 189 హిమానీనద సరస్సులపై నిర్వహించిన శాస్త్రీయ అంచనా తర్వాత వాటిల్లో 56 సరస్సులను 'అత్యంత ప్రమాదకరమైనవిగా' వర్గీకరించినట్టు జూలైలో కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. భారత హిమాలయ నదీ పరివాహక ప్రాంతాల్లో 10 హెక్టార్లకు పైగా విస్తీర్ణం ఉన్న 2,485 హిమానీనద సరస్సులను కేంద్ర జల సంఘం పర్యవేక్షిస్తోందని ప్రభుత్వం వెల్లడించింది.సహజ ఆనకట్టలను బద్దలుకొట్టుకుని కొట్టి హిమానీనదాలుఒక్కసారిగా పొంగిపొర్లితే ఎంతటి విధ్వంసం జరుగుతుందో హిమాలయాలు ఇప్పటికే చవిచూశాయి.2023లో హిమానీనద సరస్సు ఉప్పొంగి వచ్చిన వరదల కారణంగా సిక్కింలో కనీసం 70 మంది చనిపోయారు. రహదారులు, వంతెనలు, జలవిద్యుత్ ప్రాజెక్టులు ధ్వంసమయ్యాయి. 2021లో ఇలాంటి విపత్తు కారణంగా రిషిగంగా, ధౌలిగంగా లోయల్లో భారీ వరదలు సంభవించి 200 మందికిపైగా మరణించారు.అయితే హిమాలయాల నుంచి పొంచి ఉన్న ప్రమాదం ఇలాంటి భారీ వరదలకే పరిమితం కాలేదు.ఈ శతాబ్దం మధ్య నాటికి చాలా హిందూ కుష్ హిమాలయ నదీ పరీవాహక ప్రాంతాల్లో 'పీక్ వాటర్' ఏర్పడుతుందని ఐసీఐఎంఓడీ పేర్కొంది. అంటే, హిమానీనదాలు కరిగే కొద్దీ నదుల్లోకి చేరే నీటి పరిమాణం ఒక దశలో గరిష్ఠ స్థాయికి చేరుతుంది. ఆ తర్వాత హిమానీనదాలు మంచు ద్రవ్యరాశిని కోల్పోతూ పోవడంతో ఆ నీటి ప్రవాహం క్రమంగా తగ్గడం మొదలవుతుంది.హిమాలయాలపై ఆధారపడటం వల్ల ఆర్థికంగా ఎంత ప్రమాదకరమో ఈ కొత్త పరిశోధన స్పష్టం చేస్తోంది.హిమాలయాల నుంచి లభించే నీరు భారత జీడీపీలో దాదాపు 20 శాతానికి ఆధారంగా ఉందని నివేదిక అంచనా వేసింది. గోధుమ, వరి, టీ సాగుతో పాటు జలవిద్యుత్, తీర్థయాత్రల ఆధారిత ఆర్థిక కార్యకలాపాలకు ఈ నీరే కీలకంగా ఉందని తెలిపింది."హిమాలయాలు మన భూమికి మూడో ధ్రువం లాంటివి, ఆర్కిటిక్ లేదా అంటార్కిటికా ధ్రువంలా కాకుండా ఇక్కడ కోట్ల మంది ప్రజలు నివసిస్తున్నారు" అని ఆర్థికవేత్త లార్డ్ నికోలస్ స్టెర్న్ అన్నారు.ఇది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కీలకమైన మౌలిక వసతులతో ముడిపడి ఉంది," అని ఆయన అన్నారు. అయితే వాటికి ఆధారంగా ఉన్న పర్యావరణ వ్యవస్థ "పరిస్థితులు ఒక్కసారిగా మారిపోయే కీలక దశకు చేరువవుతోంది" అని ఆయన హెచ్చరించారు.హిమాలయల్లో హిమానీ నదాల కరుగుదలకు బ్లాక్ కార్బన్ దాదాపు మూడోవంతు కారణమని సిస్టమ్‌ఐక్యూ పరిశోధన అంచనా వేసింది. ఇందులో అధిక భాగం మైదాన ప్రాంతాల్లోని ఇటుక బట్టీల నుంచి వెలువడుతోంది. మంచు, హిమానీనదాలపై పేరుకునే ఈ మసి ఎక్కువ సూర్యకాంతిని గ్రహించడం వల్ల అవి మరింత వేగంగా కరుగుతాయి.ప్రపంచవ్యాప్తంగా వెలువడే గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాలతో పోలిస్తే, బ్లాక్ కార్బన్ కాలుష్యాన్ని తగ్గించడం భారత్, పొరుగు దేశాలు నేరుగా చర్యలు తీసుకోగల అంశం అని నివేదిక పేర్కొంది."హిమాలయాలు ఒక కీలక మలుపు దశకు చేరుకుంటున్నాయి. లక్షలాది మంది ప్రజల ప్రాణాలు, జీవనోపాధి ఇప్పుడు ప్రమాదంలో ఉన్నాయి," అని సిస్టమ్‌ఐక్యూ సీనియర్ డైరెక్టర్, నివేదిక ప్రధాన రచయిత అరుషి చోప్రా అన్నారు. "హిమానీనదాలు పదేళ్ల క్రితం కంటే ఇప్పుడు మరింత వేగంగా కరుగుతున్నాయి" అన్నారు. బ్లాక్ కార్బన్ కాలుష్యాన్ని తగ్గించడం, హిమానీనదాల పర్యవేక్షణను పెంచడం, ముందస్తు ప్రమాద హెచ్చరిక వ్యవస్థలను మెరుగుపరచడం, కొండ ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని మార్చడం వంటివి ఉన్నాయి.విపత్తును ఎదుర్కొనే సన్నద్ధతను పెంచడం నివేదిక సూచించిన ప్రధానమైన లక్ష్యాల్లో ఒకటి. ప్రమాదం ముంచుకొచ్చినప్పుడు జనాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించడం నుంచి కీలకమైన నిర్మాణాలు దెబ్బతినకుండా కాపాడటం వరకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో ప్రభుత్వాలు ముందే నిర్ణయించుకోవాలని పేర్కొంది.మరో ముఖ్యమైన సూచన పర్యటకంపై పునరాలోచన. భారత హిమాలయ ప్రాంతంలో ఏడాదికి దాదాపు 40 కోట్ల పర్యటక సందర్శనలు నమోదవుతున్నాయి. పర్యటకుల సంఖ్యను వీలైనంతగా పెంచడమే లక్ష్యంగా కాకుండా, పర్యటకం ద్వారా వచ్చే విలువ స్థానికంగానే మిగిలి, తిరిగి ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగపడేలా విధానాన్ని మార్చాలని పరిశోధకులు సూచిస్తున్నారు.హిమాలయాల్లో ఎదురయ్యే ప్రమాదాలు రానురాను మరింత సంక్లిష్టంగా మారుతున్నాయని ఐసీఐఎంఓడి డైరెక్టర్ జనరల్ పెమా గ్యామ్‌ట్షో తెలిపారు."హిమానీనదాలు కరిగిపోతున్నాయి. శాశ్వతంగా గడ్డకట్టిన నేల, ఎత్తైన కొండ వాలు ప్రాంతాలు మరింత అస్థిరంగా మారుతున్నాయి. దీని వల్ల దిగువ ప్రాంతాల్లోని ప్రజలు, అక్కడి మౌలిక సదుపాయాలు కూడా ఒకదానితో ఒకటి ముడిపడిన వరుసగా సంభవించే ప్రమాదాల బారిన పడే ముప్పును ఎదుర్కొంటున్నారు" అని చెప్పారు.ఈ ప్రమాదాలకు హిమాలయాలపై గీసిన దేశ సరిహద్దులు అడ్డుకావు. ఇలాంటి విపత్తులు "జాతీయ సరిహద్దులను పట్టించుకోవు. ఏ ఒక్క దేశం వాటిని ఒంటరిగా ఎదుర్కోలేదు" అని గ్యామ్‌షో అన్నారు.అందుకే సరిహద్దులు దాటి పర్యవేక్షణ, ప్రమాదాల సమాచారాన్ని పరస్పరం పంచుకోవడం, ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవడం, విపత్తులను ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచేందుకు సంయుక్తంగా పెట్టుబడులు పెట్టడం అత్యవసరంగా మారాయి. ఈ పర్వతాలపై ఆధారపడి జీవిస్తున్న కోట్లాది మంది ప్రజల ప్రాణాలను, జీవనోపాధులను, ఆర్థిక వ్యవస్థలను రక్షించడానికి కూడా ఇది చాలా ముఖ్యం.

# యూపీఐ చార్జీల మోత




సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ సౌకర్యాలు మెరుగుపడతాయనేది తెలిసిందే. అయితే ఆ సాంకేతికత వ్యాపార సూత్రంగా మారినప్పటి నుంచీ సమస్యలు మొదలవుతాయి. ఎందుకంటే వడ్డింపులు లేకుండా వ్యాపారం ఉండదు. వడ్డింపులు మొదట్లో నొప్పి తెలియకుండా ఉండీఉండనట్టుగానే ఉంటాయి. క్రమంగా డోసు పెరుగుతుంది. ప్రజలు క్రమంగా అలవాటు పడుతారులే అని వ్యాపార వర్గాలు భావిస్తుంటాయి.ఇంజనీరింగ్ కోర్సులు ఎంచుకోండి ఈ సూత్రం తాజాగా యూపీఐ అనే ఆన్‌లైన్ చెల్లింపుల వ్యవస్థకూ వర్తిస్తున్నదా? అనే సందేహాలు సామాన్యుల్లో మొదలయ్యాయి. 2016లో మొదలైన యూపీఐ విధానంలో సెల్‌ఫోన్లు లేదా ఇతర ఆన్‌లైన్ పద్ధతుల్లో క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా చెల్లింపులు చిటికెలో జరిపే సౌలభ్యం ఏర్పడింది. పాలు, కూరగాయలు మొదలుకొని పచారీ సామాను దాకా యూపీఐపై చెల్లింపులు జోరుగా సాగుతుండటం మనం చూస్తున్నాం. టీ తాగినా, బిస్కెట్ పొట్లం కొన్నా సెల్‌ఫోన్ తీయడం.. స్కాన్ చేసి చెల్లింపు జరుపడం సర్వసాధారణం అయిపోయింది. ఎలాంటి చార్జీలు ఉండవనే నమ్మకం కారణంగా ఈ చెల్లింపుల వ్యవస్థ అంచెలంచెలుగా ఎదిగింది. కేవలం గత నెలలోనే 2,451 కోట్ల లావాదేవీల కింద రూ.29.82 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. నిరుడు అంటే 2025-26 లెక్కలు తీసుకుంటే రూ.24,162 కోట్ల లావాదేవీలకుగాను రూ.314 లక్షల కోట్ల చెల్లింపులు జరిగాయి. ఫోన్‌పే (45.9 శాతం), గూగుల్ పే (32.4 శాతం), పేటీఎం (8.1 శాతం) వాటాతో మొదటి మూడు స్థానాలను ఆక్రమించాయి.పారిశ్రామిక పరికరాలు కనుగొనండి పదేండ్ల క్రితం చిన్న మొక్కగా మొదలైన యూపీఐ చెల్లింపుల వ్యవస్థ ఇప్పుడు వటవృక్షం స్థాయికి ఎదిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన కొన్నిరకాల రుసుములతో యూపీఐ వేగానికి బ్రేకులు పడుతాయా? అనే అనుమానాలు మొదలయ్యాయి. అయితే ఎంతో కొంత చార్జీ చేయకుండా ఉచిత సేవ ఎన్నాళ్లు కొనసాగిస్తారనే వాదనలూ వినిపిస్తున్నాయి. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ) యూపీఐ చెల్లింపుల విధానంలో కీలక మార్పులు చేసింది. తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ వినియోగదారుల్లో కలకలం సృష్టించింది. ఇకపై వ్యక్తుల నుంచి వ్యాపారికి (పీ2ఎం) రూ.2,000కు పైబడి జరిపే యూపీఐ చెల్లింపులపై 0.4% మేర మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) విధిస్తారు. ఈ సుంకం చెల్లింపు మొత్తం పెరుగుతున్నకొద్దీ మారుతుంది. ఈ అదనపు చార్జీ వినియోగదారులు కాకుండా వ్యాపారులే బ్యాంకులు, చెల్లింపు సేవా సంస్థలకు చెల్లించాల్సి ఉంటుంది. అయితే రూ.2,000 లోపు లావాదేవీలకు ఎలాంటి చార్జీలూ ఉండవు. యూపీఐ వ్యవస్థను దీర్ఘకాలికంగా నిలబెట్టేందుకు, బ్యాంకులు, ఫిన్‌టెక్ సంస్థలకు ఆదాయం కల్పించేందుకు తీసుకున్నట్టుగా చెప్తున్న ఈ నిర్ణయం యూపీఐ చెల్లింపులపై తీవ్ర ప్రభావం చూపుతుందనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రుసుమును వ్యాపారులే భరించాలని, వినియోగదారులపై దీనిని రుద్దకుండా చూస్తామని అంటున్నప్పటికీ ఈ వివరణ అంతగా నమ్మకం కలిగించలేకపోతున్నది. ఇందుకు రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి; వ్యాపారులు ఈ అదనపు భారాన్ని వినియోగదారుల మీదకు నెడుతారనే అనుమానాలు వ్యక్తం కావడం. రెండు; మొత్తంగా ఈ చెల్లింపులను నిరాకరించే అవకాశాలు ఉండటం. అయితే కొన్ని మినహాయింపులూ ఇవ్వడం గమనార్హం. రూ.2,000 వరకు చెల్లింపులపై ఎలాంటి రుసుమూ ఉండదు. ఆ పైచిలుకు చెల్లింపులను వ్యాపారులు నగదు రూపంలో చెల్లించాలని డిమాండ్ చేస్తే వినియోగదారుకు వేరే మార్గం ఉండదనేది తెలిసిందే. గ్రామీణ ప్రాంతాలు, చిన్న పట్టణాల్లో జరిపే చెల్లింపులపై ఈ ఎండీఆర్ రుసుము ఏమాత్రం వర్తించదు. వ్యక్తిగత స్థాయిలో జరిపే లావాదేవీలు పూర్తిగా ఉచితమే. యూపీఐ వ్యవస్థ నిర్వహణ, విస్తరణ వ్యయాన్ని ఇంతవరకు ప్రభుత్వం, బ్యాంకు లు, చెల్లింపు సంస్థలు భరిస్తున్నాయి. ఎండీఆర్ ద్వారా ఆ భారాన్ని వ్యాపారుల మీదకు మళ్లిస్తున్నట్టు తాజా నోటిఫికేషన్ వెల్లడిస్తున్నది. కానీ ఇది అంతిమంగా వినియోగదారుల జేబులకు చిల్లు పెట్టే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద యూపీఐ వ్యవస్థను ఏర్పాటు చేసిన భారత్‌లో అందుకు అవసరమైన సాంకేతిక వ్యయం సమస్యగా మారినట్టు కనిపిస్తున్నది. ఫలితంగా వినియోగదారులు నగదు చెల్లింపులే నయమనుకునే రోజులు వస్తే అందులో ఆశ్చర్యం ఏముంటుంది?

# ఎవరికి ఎవరు?



తాము సొంతంగా తయారుచేసుకున్న ఒక నాటు క్షిపణితో సౌదీ అరేబియాకు చెందిన ఎఫ్--15 యుద్ధవిమానాన్ని కూల్చివేశామంటూ హౌతీలు చేసిన ప్రకటన ప్రపంచాన్ని నివ్వెరపరచింది. ఒక 'లోకల్ మేడ్' సర్ఫేస్ టు ఎయిర్ మిసైల్‌తో ఈ అత్యంత శక్తిమంతమైన, అత్యాధునిక అమెరికన్ యుద్ధవిమానాన్ని సెంట్రల్ యెమెన్‌లోని మారిబ్ ప్రావిన్సులో తాము నేలకూల్చామన్న వార్తను మిగతా ప్రపంచం అంత సులభంగా నమ్మదని ఈ తిరుగుబాటుదా రులకు తెలుసు. కనుకనే, అది గాలిలో ఎగురుతున్నప్ప టినుంచి నేలకూలేంతవరకూ మొత్తం ఓ నాలుగునిముషాల వీడియోను వారు విడుదల చేశారు. అత్యాధునిక రాడార్లు, మిసైల్ హెచ్చరిక వ్యవస్థలు దట్టించివున్న ఈ అమెరికా తయారీ యుద్ధవిమానం హౌతీల చేతిలో కూలినట్టుగా చెబుతున్న ఆ వీడియో నిజమైనదో, నకిలీదో తేల్చడానికి రంగంలోకి దిగిన పాశ్చాత్య మీడియా సంస్థలు, సాంకేతిక సంస్థలు పలురకాలుగా దానిని పరీక్షించే పనిలో పడ్డాయి. మొదట కొద్దిసేపు థెర్మల్ గ్రాఫిక్స్ ఉన్న ఈ వీడియో చివరలో తగలబడిపోతున్న యుద్ధవిమానం, దాని చుట్టూ చేరి నినాదాలు చేస్తున్న హౌతీలు కనిపిస్తున్నారు. విమానం తోకభాగాన ఉన్న నాలుగు అంకెల సీరియల్ నెంబర్, సౌదీ జెండా తదితర గుర్తులన్నీ ఈ వీడియోలో స్పష్టంగా కనిపిస్తున్నాయి. సౌదీ వైమానిక స్థావరాల్లో ఉన్న విమానాల వివరాలతో దీనిని సరిపోల్చి, కూల్చివేత నిజం అని తేల్చుకున్న మీడియా సంస్థలు హౌతీలకు ఇంత సాంకేతికశక్తి ఎలా వచ్చింది? అంటూ విశ్లేషణలు ఆరంభించాయి. ఇరాన్ మీద అమెరికా యుద్ధం మొదలెట్టిన తరువాత కుప్పకూలిన రెండవ ఎఫ్--15 ఇది. ఏప్రిల్‌లో ఇరాన్ జరిపిన దాడిలో ఒక విమానం కూలి, మరొకటి కనిపించకుండా పోయింది. మొదటి ఎఫ్15ను ఇరాన్ కూల్చివేసినప్పుడు ఆశ్చర్యపోయిన పాశ్చాత్యమీడియా ఇప్పుడు రెండోది హౌతీల చేతిలో ధ్వంసమైంది కనుక, ఇరాన్ సాంకేతికసాయం ఈ తిరుగుబాటుదారులకు ఎంత ఉధృతంగా చేరుతోందో లెక్కలు వేస్తోంది. నలిగిన దుస్తులు, అరిగిన చెప్పులు, చేతిలో నాటుతుపాకీతో హౌతీలు ఈ వీడియోను విడుదల చేసి, తమను తక్కువగా అంచనావేయవద్దని అమెరికా, దాని మిత్రదేశమైన సౌదీ అరేబియాకు బలమైన సంకేతాన్ని పంపించారు. తాము మహాశక్తిమంతులమనీ, ఎంతటి యుద్ధానికైనా సంసిద్ధంగా ఉన్నామని దాని అర్థం. ప్రస్తుతానికి ప్రచారయుద్ధంలో వారిదే పైచేయి. ఇప్పటికే సౌదీపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తున్న హౌతీలు ఇప్పుడు యుద్ధవిమానం కూల్చివేత ప్రకటనతో పశ్చిమాసియా ఉద్రిక్తతలను మరింత పెంచేశారు. సౌదీ--హౌతీ ఘర్షణ మక్కా మదీనా వరకూ చేరడం కూడా ఆందోళన కలిగించే పరిణామం. మక్కాకు దక్షిణంగా ఒక హౌతీ డ్రోన్‌ను కూల్చివేశామని సౌదీ ప్రకటించడం, తాము మక్కాజోలికి పోనేలేదని హౌతీలు చెబుతున్నా, ఇస్లామిక్ దేశాల సమాఖ్య సహా చాలా దేశాలు ఈ పరిణామాన్ని ఖండించడం తెలిసిందే. 'రెడ్‌లైన్' దాటవద్దని హౌతీలను హెచ్చరిస్తున్న సౌదీకి అండగా నిలవాల్సిన పాకిస్థాన్, తుర్కియేలు కూడా మొఖం చాటేశాయి. పవిత్ర మక్కానగరం మీదే దాడిప్రయత్నం జరిగిందని సౌదీ అంటున్నప్పుడు మక్కా ఒప్పందానికి లోబడి మూడుదేశాలూ ఏకతాటిపైకి రాలేకపోవడం విశేషం.

యెమెన్‌లోని చాలా ప్రాంతాలను తమ అధీనంలోకి తెచ్చుకొని, ఎర్రసముద్రం తీరాన్ని గుప్పిట్లో పెట్టుకొని, మూడు కీలకమైన ద్వీపాలను వేగంగా స్వాధీనం చేసుకున్న హౌతీలమీద యుద్ధవిమానాలతో విరుచుకుపడమని అమెరికాను సౌదీ కోరితే, నేరుగా వారితో తలపడేది లేదని ట్రంప్ కూడా తేల్చేశారు. హౌతీలను వెనక్కునెట్టడానికి సౌదీ దాడులు ఒక్కటే సరిపోవని ట్రంప్‌కు తెలియకపోదు. దాడులతో సౌదీ చమురు ఉత్పత్తిని దెబ్బతీసి, బాబ్--అల్ మాండెబ్ జలసంధి స్వాధీనం సహా యూరప్--ఆసియా మధ్య కీలక చమురు రవాణామార్గాన్ని నియంత్రిస్తున్న హౌతీలతో కయ్యం కంటే వియ్యం ఉత్తమమని ట్రంప్ భావిస్తున్నట్టుగా వార్తలు వస్తున్నాయి. సౌదీ కోసం హౌతీలతో పోరాడేకంటే, వారినే తనదారికి తెచ్చుకోవాలని ప్రయత్నిస్తున్నట్టు ఉంది. ఒమాన్‌లో అమెరికా--హౌతీ మధ్య చర్చల్లో ఉభయపక్షాలు బాగానే ఇచ్చిపుచ్చుకుంటున్నాయట. ఇవి అంతిమంగా ప్రపంచానికి ప్రయోజనం చేకూర్చుతాయో లేదో తెలియదు కానీ, సౌదీ యువరాజు ఎంబీఎస్‌కు మాత్రం ఈ వరుస పరిణామాలన్నీ పెద్ద ఎదురుదెబ్బ.

## ఫార్ములా ఈ-రేసు కేసులో
# కోర్టుకు హాజరైన కేటీఆర్, అర్వింద్ కుమార్, బీఎల్ఎన్ రెడ్డి, కిరణ్ మల్లేశ్వరరావు



**హైదరాబాద :** ఫార్ములా ఈ-రేస్ వ్యవహారంలో నమోదైన కేసు విచారణకు సంబంధించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ హైదరాబాద్‌లోని నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. ఆయనతో పాటు ఈ కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్, హెచ్ఎండీఏ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డి, స్పోర్ట్స్ కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు కూడా న్యాయస్థానం ముందుకు వచ్చారు.గతంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా ఈ-రేస్ కోసం హెచ్ఎండీఏ నిధుల నుంచి సుమారు రూ. 55 కోట్లను విదేశీ సంస్థకు బదిలీ చేయడంపై ఏసీబీ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఎలాంటి ముందస్తు అనుమతులు పొందకుండా, ఆర్థిక నిబంధనలు, ప్రామాణిక విధివిధానాలను ఉల్లంఘించి ఈ నిధులను కేటాయించారనే ఆరోపణలతో దర్యాప్తు సంస్థ చార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఏసీబీ సమర్పించిన నివేదికను పరిగణనలోకి తీసుకున్న ప్రత్యేక కోర్టు, నిందితులకు ఇదివరకే సమన్లు జారీ చేసింది. గత విచారణ సమయంలో కేటీఆర్ వ్యక్తిగత కారణాల వల్ల మినహాయింపు కోరగా, విచారణ ఈనాటికి వాయిదా పడటంతో ఆయన ప్రత్యక్షంగా హాజరయ్యారు.

**కేటీఆర్ సిబ్బంది విచారణ: సీసీటీవీ ఫుటేజ్ భద్రపరచండి**

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైఫాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు.అయితే, ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు.ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

# కార్యకర్తలే నా బలం.. బాధపడి ఉంటే క్షమించండి


**అడ్డతీగల సమావేశంలోని మాటలను పూర్తి సందర్భంలో చూడాలి**

**ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**



**రాజవొమ్మంగి:** అడ్డతీగలలో గతంలో జరిగిన సమావేశంలో తాను మాట్లాడిన మాటల్లోని కొన్ని భాగాలు మాత్రమే సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలోకి వచ్చాయని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి తెలిపారు. శుక్రవారం రాజవొమ్మంగి మండల కేంద్రంలో మీడియాతో మాట్లాడుతూ ఆమె ఈ విషయంపై వివరణ ఇచ్చారు.సమావేశంలో తాను మాట్లాడిన పూర్తి విషయాన్ని కాకుండా, కొన్ని మాటలను మాత్రమే విడిగా తీసుకుని ప్రచారం చేయడం వల్ల తన మాటల అసలు ఉద్దేశం వేరుగా అర్థమయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆమె తెలిపారు. ఆ సమావేశంలో ఏ పరిస్థితుల్లో మాట్లాడాల్సి వచ్చింది, ఏ సందర్భంలో ఆ మాటలు వచ్చాయి, వాటి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటో పూర్తి వీడియో చూస్తే స్పష్టంగా అర్థమవుతుందని చెప్పారు.కార్యకర్తలతో మాట్లాడే సమయంలో తాను కొంత కఠినంగా మాట్లాడి ఉంటే, ఆ మాటల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే తనను క్షమించాలని ఎమ్మెల్యే మనస్ఫూర్తిగా కోరారు. కార్యకర్తలను బాధపెట్టాలనే ఉద్దేశంతో తాను ఎప్పుడూ మాట్లాడలేదని తెలిపారు. "కార్యకర్తలు ఉంటేనే నేను ఉన్నాను. నా ఒక్కరి సంకల్పంతోనే నేను ఎమ్మెల్యే కాలేదు. కార్యకర్తల బలం, వారి నమ్మకం, వారి కష్టంతోనే ఈరోజు రంపచోడవరం నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు వచ్చింది" అని శిరీష దేవి అన్నారు.కుటుంబంలో ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని సరిచేయడానికి కొన్నిసార్లు కుటుంబ సభ్యులతో గట్టిగా మాట్లాడాల్సి వస్తుందని, అదే భావనతో ఆ సమయంలో కార్యకర్తలతో మాట్లాడానని ఆమె వివరించారు. కార్యకర్తలను తాను కేవలం రాజకీయంగా తనతో పనిచేసే వారిగా కాకుండా కుటుంబ సభ్యులుగానే భావిస్తానని తెలిపారు.తన మాటల్లో కఠినత కనిపించి ఉండొచ్చుని, అయితే వాటిని పూర్తి సందర్భంలో చూస్తే ఆ సమయంలో తాను చెప్పాలనుకున్న విషయం స్పష్టమవుతుందని ఆమె పేర్కొన్నారు. తన మాటల వల్ల ఏ కార్యకర్త మనసైనా నొచ్చి ఉంటే పెద్ద మనసుతో తనను క్షమించాలని కోరారు.కార్యకర్తల నమ్మకం, సహకారం తనకు ఎప్పటికీ ముఖ్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, గత సమావేశంలో జరిగిన విషయాన్ని కొన్ని మాటల ఆధారంగా కాకుండా పూర్తి వీడియో, పూర్తి సందర్భాన్ని పరిగణనలోకి తీసుకుని అర్థం చేసుకోవాలని కోరారు.

# వైష్ణవీ భర్త దారుణ హత్య
# అన్నంత పనీ చేసిన సంతోష్..



**కరీంనగర్ :** యూట్యూబర్ వైష్ణవి హత్య కేసులో ప్రధాన నిందితుడైన ఆమె భర్త చిత్తరి హరిబాబు (26)ను తానే చంపానంటూ వైష్ణవి సోదరుడు సంతోష్ ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశాడు. నిజామాబాద్‌లో గురువారం పట్టపగలు నడిరోడ్డుపై దుండగులు హరిబాబును కిరాతకంగా నరికి చంపారు. ఈ హత్య జరిగిన కొన్ని గంటల్లోనే సంతోష్ ఈ వీడియోను విడుదల చేస్తూ పోలీసులకు లొంగిపోతున్నట్టు ప్రకటించాడు. వైష్ణవి హత్యకేసులో గత కొంతకాలంగా బెయిల్‌పై బయట ఉన్న హరిబాబు, తన తల్లితో కలిసి నిజామాబాద్‌లోని ఇంద్రాపూర్‌లో నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మొక్కజొన్న కంకులు అమ్ముతూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం, దాహం వేయడంతో పక్కనే ఉన్న చాట్‌బండి వద్దకు నీళ్ల కోసం వెళ్లాడు. అదే సమయంలో కారులో వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేశారు. ఒక వ్యక్తి కారులో నుంచి దిగి, పదునైన ఆయుధంతో హరిబాబు తలపై విచక్షణారహితంగా నరికాడు. కేవలం 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికినట్లు సీసీ కెమెరాల్లో రికార్డయింది. తీవ్ర రక్తస్రావంతో హరిబాబు అక్కడికక్కడే మరణించాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.ఈ ఏడాది మార్చి 16న జగిత్యాల జిల్లా కోరుట్లలో తన భార్య, నాలుగు నెలల గర్భిణి అయిన వైష్ణవి (19)ని హరిబాబు గొంతు నులిమి, కత్తితో పొడిచి హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఈ కేసులో అరెస్టయిన హరిబాబు, ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చాడు. అయితే, తన చెల్లి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయిందని, అందుకే తానే హరిబాబును హత్య చేశానని వైష్ణవి సోదరుడు సంతోష్ వీడియోలో తెలిపాడు. "నా చెల్లిలి హత్య కేసులో ప్రభుత్వం న్యాయం చేయలేకపోయింది. హరిబాబును నేనే చంపా. పోలీసులకు లొంగిపోతున్నా. నాకు శిక్ష పడకుండా ప్రజలు మద్దతు ఇవ్వాలి" అని సంతోష్ ఆ వీడియోలో కోరాడు.కోరుట్లకు చెందిన హరిబాబు, మాదాపూర్ గ్రామానికి చెందిన వైష్ణవి ప్రభుత్వాసుపత్రిలో స్వీపర్లుగా పనిచేస్తూ ప్రేమించుకున్నారు. 14 నెలల క్రితం పెళ్లి చేసుకుని, వైష్ణవి పుట్టింట్లోనే కాపురం పెట్టారు. ఆమె యూట్యూబ్ రీల్స్ చేస్తూ గుర్తింపు తెచ్చుకుంది. అయితే, కొద్దికాలానికే ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో, గర్భిణి అని కూడా చూడకుండా వైష్ణవిని హరిబాబు హత్య చేశాడు. వైష్ణవి తన కుటుంబంలో ఏకైక ఆడపిల్ల కావడంతో పాటు, ఆమెకు సొంత, సమీప బంధువుల కుమారులు కలిపి మొత్తం 13 మంది సోదరులు ఉన్నారు. వారందరికీ ఆమె అంటే ప్రాణం. ఆమె హత్యను జీర్ణించుకోలేకపోయిన సోదరులు, హరిబాబును కఠినంగా శిక్షించాలని, లేదంటే తామే చంపేస్తామని అప్పట్లో ప్రతినబూనారు. అన్నంత పనీ ఇప్పుడు చేయడం కోరుట్లలో చర్చనీయాంశంగా మారింది. ఆరు నెలల వ్యవధిలో జరిగిన ఈ రెండు హత్యలు ఇరు కుటుంబాల్లో తీరని శోకాన్ని మిగిల్చాయి.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న టూ టౌన్ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించి క్లూస్ టీమ్స్ సాయంతో సీసీటీవీ ఫుటేజీలను నిశితంగా పరిశీలిస్తున్నారు. వైష్ణవి కుటుంబ సభ్యుల ప్రమేయంపై పోలీసులు తొలి నుంచి అనుమానాలు వ్యక్తం చేస్తున్నప్పటికీ, సంతోష్ చేసిన ప్రకటనతో దర్యాప్తు వేగం పుంజుకుంది. చట్టం తన పని తాను చేసుకుపోతుందనే నమ్మకం సన్నగిల్లి, బాధితులే నేరుగా రివెంజ్ కు పాల్పడడం పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. వ్యవస్థల వైఫల్యమే ఇలాంటి దారుణాలకు ఆస్కారం ఇస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి

## ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు..

**ముగ్గురు విద్యుత్ శాఖ సిబ్బంది మృతి..**

**ఇద్దరికి తీవ్ర గాయాలు**

**శంకరపట్నం :** కరీంనగర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. గురువారం రాత్రి శంకరపట్నం మండలం తాడికల్ గ్రామ శివారులో జాతీయ రహదారిపై రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని కారు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. కారు నిజామాబాద్ నుంచి వరంగల్ వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది.పోలీసులు, స్థానికుల వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా విద్యుత్ శాఖకు చెందిన ఐదుగురు సిబ్బంది కారులో వరంగల్ వైపు బయలుదేరారు. తాడికల్ గ్రామ శివారుకు చేరుకోగానే రహదారి పక్కన ఆగి ఉన్న లారీని కారు వేగంగా వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా నుజ్జునుజ్జయింది. ప్రమాద తీవ్రతకు ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.మృతులను నిజామాబాద్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్న శేఖర్, విశ్వేశ్వరరావు, పర్షిగా పోలీసులు గుర్తించారు. తీవ్రంగా గాయపడిన ప్రవీణ్, మురళిని కరీంనగర్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. సమాచారం అందుకున్న హుజూరాబాద్ ఏసీపీ మాధవి, సీఐ శ్రీనివాస్, ఎస్సై శేఖర్‌రెడ్డి ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడంతో పాటు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీ వ్యాప్తంగా డ్రగ్ కంట్రోల్ అధికారుల తనిఖీలు

**అమరావతి :** డ్రగ్ కంట్రోల్ అధికారులు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగగా తనిఖీలు చేసారు. 100 మందుల దుకాణాల్లో తనిఖీలు.. అందులో 55 దుకాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తిం,చారు,. భారీగా ట్రామాడోల్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్నారు. , ఐదుగురు అరెస్ట్ అయ్యారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో పెద్దమొత్తంలో ట్రామాడోల్ వినియోగిస్తున్నట్లు గుర్తించారు.. ఈ ఏడాది శ్రీలక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ 20 వేల ట్రామాడోల్ ఇంజెక్షన్లు కొనుగోలు చేసినట్లు గుర్తించారు. గుట్టుచప్పుడు కాకుండా దాచిపెట్టిన 7,550 ట్రామాడెక్స్ ఇంజక్షన్లు స్వాధీనం చేసుకుననారు. ట్రామాడెక్స్ ఇంక్షన్లను జంగారెడ్డిగూడెం, మేద్యానపు వరిగూడెం, వేగవరం, కుక్కునూరు తదితర ప్రాంతాల్లోని దుకాణాలు, వ్యక్తులకు సరఫరా చేసినట్లు గుర్తించారు. నకిలీ బిల్లులతో 5,200 ట్రామెక్ ఇంజక్షను డి.రూపా పెడ్డింటి మెడికల్ ఏజన్సీ కొనుగోలు చేసింది. 3,930 ఇంజెక్షన్లను తెలంగాణలోని ఓ మందుల దుకాణానికి విక్రయించినట్లు బిల్లులు డి.రూపా పెడ్డింటి మెడికల్ ఏజన్సీ చూపించింది. ఆ లావాదేవీలన్నీ నకిలీవని తెలంగాణ అధికారులు నిర్ధారించారు. శ్రీ లక్ష్మి శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ, డి.రూప పెడ్డింటి మెడికల్ ఏజెన్సీల లైసెన్సులు రద్దుకు చర్యలు ప్రారంభించారు.

## ఏసీబీకి చిక్కిన కీసర సీఐ, ఎస్ఐ..
## స్థానికుల సంబరాలు

**మేడ్చల్ మల్కాజిగిరి** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఏసీబీ ట్రాప్ తో సీఐ ఆంజనేయులు, ఎస్ఐ జ్ఞానేందర్ రెడ్డి పట్టుబడటం హాట్ టాపిక్గా మారింది. లంచం తీసుకున్న కేసులో సీఐ, ఎస్ఐలను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. అయితే సీఐ, ఎస్ఐ పట్టుబడటంతో స్థానికుల సంబరాలు చేసుకున్నారు. కీసర, బోగారం గ్రామాల వారు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. పలు కేసుల్లో లంచం ఇవ్వాలంటూ వేధించారని స్థానికులు ఆరోపించారు.

## నరసరావుపేటలో మసాజ్ సెంటర్పై
## పోలీసుల ఆకస్మిక దాడి

**నరసరావుపేట :** నరసరావుపేటలో మసాజ్ సెంటర్పై పోలీసులు ఆకస్మిక దాడి చేసారు. ఓ వ్యక్తి, ముగ్గురు మహిళల ను అదుపులోకి తీసుకున్నారు. మసాజ్ సెంటర్లో జరుగుతున్న కార్యకలాపాల వెనుక సూత్ర దారులు ఎవరు..? పలువురు వ్యక్తులు అండదండలతో పోలీసులకు సైతం మామూళ్లు అందిస్తున్న ప్రధాన సూత్రధారి అని ఆరోపణలు వచ్చాయి. మసాజ్ సెంటర్ల నిర్వహణ పై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఘటన పై నరసరావుపేటలో హాట్ టాపిక్ నడుస్తోంది.

## టిప్పర్ లారీ ఢీకొని స్కూటీపై
## వెళ్తున్న వ్యక్తి మృతి

**పల్నాడు :** పిడుగురాళ్ల పట్టణంలోని గవర్నమెంట్ జూనియర్ కాలేజీ ఎదుట శుక్రవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్కూటీపై వెళ్తున్న వ్యక్తిని టిప్పర్ లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన వ్యక్తి అక్కడికక్కడే మృతి....మృతుడు పెదనెమలిపురి గ్రామానికి చెందిన రామకృష్ణగా గుర్తించినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంతో ఘటనాస్థలంలో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.సమాచారం అందుకున్న పట్టణ ఎస్ఐ శివ నాగరాజు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు... మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించే ఏర్పాట్లు చేస్తున్నారు...ప్రమాదంపై పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడికానున్నాయి.

## గణనాధుడి లడ్డును కైవసం చేసుకున్న
## భక్తాగ్రేసరుడు నరేంద్ర ముదిరాజ్...

**రేణిగుంట:** భారతీయ సంస్కృతిలో వినాయక చవితి ఉత్సవాలకు ఉన్న విశిష్టత అంతా ఇంతా కాదు. విఘ్నేశ్వరుని పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ఆధ్యాత్మిక శోభతో ప్రతి వీధి కళకళలాడుతుంది. ఇక గణనాథుని నిమజ్జనానికి ముందు జరిగే లడ్డు వేలంపాట ఈ పండుగలో అత్యంత ఆసక్తికరమైన, భక్తిభరితమైన ఘట్టం. ఈ లడ్డును దక్కించుకోవడం కేవలం ఒక ఆచారమే కాదు, మహాభాగ్యంగా, ఆయురారోగ్య ఐశ్వర్యాలను ప్రసాదించే దైవిక వరంగా భక్తులు భావిస్తారు. తిరుపతి ప్రాంతంలోని ప్రముఖ పారిశ్రామిక, చారిత్రక ప్రాంతమైన రేణిగుంట మండలం, గాజుల మండ్యం గ్రామంలో ఈ ఏడాది జరిగిన వినాయక చవితి మహోత్సవాలు అత్యంత వైభవంగా సాగాయి. ఈ వేడుకల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నిర్వహించిన గణాధుడి లడ్డు వేలంపాటలో స్థానిక ప్రముఖులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో నరేంద్ర ముదిరాజ్ అత్యధికంగా 66 వేల రూపాయల భారీ మొత్తానికి గణనాథుడి లడ్డును కైవసం చేసుకుని భక్తిభావానికి నిలువెత్తు రూపంగా నిలిచారు.

**గాజుల మండ్యం లో వైభవంగా వినాయక చవితి మహోత్సవాలు..?**

రేణిగుంట మండలానికి తలమానికంగా ఉన్న గాజుల మండ్యం గ్రామంలో ఏటా వినాయక చవితి వేడుకలు అత్యంత ఘనంగా జరుగుతాయి. గ్రామ యువకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు కలిసి ఈ వేడుకలను కనులపండువగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా ఊరంతా పండగ వాతావరణం సంతరించుకుంది. ప్రతి రోజు రకరకాల పూజా కార్యక్రమాలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతిని పంచుతున్నారు.?ఉత్సవాల్లో భాగంగా మూడవ రోజు బుధవారం నిర్వహించిన కార్యక్రమాలలో ప్రధాన ఆకర్షణ గణనాథుని లడ్డు వేలంపాట. ఈ వేలంపాట కోసం గ్రామస్థులు, చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు ఉత్సాహంగా తరలివచ్చారు. దేవుని ప్రసాదమైన లడ్డును సొంతం చేసుకోవడానికి భక్తుల మధ్య పోటీ నెలకొంది. చివరికి అందరి అంచనాలను తలకిందులు చేస్తూ భక్తి పారవశ్యంతో నరేంద్ర ముదిరాజ్ అత్యధికంగా వేల రూపాయల రికార్డు ధరకు లడ్డును దక్కించుకున్నారు.

**ఉత్సవాల ముగింపు...**

గాజుల మండ్యం గ్రామంలో జరిగిన వినాయక చవితి వేడుకలు కేవలం పూజా కార్యక్రమాలు తోనే కాకుండా ప్రజల మధ్య ఐక్యతను భక్తి భావాన్ని పెంపొందించడంలో విజయవంతమయ్యాయి. నరేంద్ర ముదిరాజ్ లాంటి భక్తా గ్రేసరుల భాగస్వామ్యం ఉత్సవాల వైభవాలు మరింత ఇనుమడింపజే సింది. విగ్నేశ్వరుని కృపతో నరేంద్ర ముదిరాజ్ మరిన్ని విజయాలను సాధించాలని సమాజానికి మరింత సేవ చేసే శక్తిని ఆ దేవుడు ప్రసాదించాలని గ్రామ ప్రజలు ఆకాంక్షించారు.

# జాతీయ డిజిటల్ పశు సంపద మిషన్ డేటా నమోదు ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్**

**జిల్లాలో 78 శాతం డేటా క్యాప్చర్ పూర్తి.. మిగిలిన 22 శాతం ప్రక్రియను వేగవంతం చేయాలి**

**ప్రతి పశువుకు 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో పశు ఆధార్.. తప్పనిసరిగా చెవి ట్యాగింగ్ చేయాలి**

**జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ సమావేశంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్**





**జగిత్యాల, సెప్టెంబర్18,(నవగీతం)**జిల్లాలో జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ కింద పశువుల డేటా క్యాప్చర్, ట్యాగింగ్ ప్రక్రియను వేగవంతం చేసి, మిగిలిన ప్రక్రియను 10 రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు.జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్ అమలు, పురోగతిపై జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ప్రకాశ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఎన్ డిఎల్ ఎం అమలు, పశువుల డేటా క్యాప్చర్, ట్యాగింగ్, నమోదు ప్రక్రియ తదితర అంశాలపై వివరాలను కలెక్టర్‌కు వివరించారు.జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో ఇప్పటివరకు పశువుల డేటా క్యాప్చర్ ప్రక్రియ 78 శాతం పూర్తయిందని, మిగిలిన 22 శాతం డేటాను క్షేత్రస్థాయిలో వేగవంతంగా నమోదు చేసి 10 రోజుల్లోగా వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామాన్ని కవర్ చేస్తూ అర్హత కలిగిన ప్రతి పశువుకు డిజిటల్ గుర్తింపు కల్పించేలా అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

**ప్రతి పశువుకు 12 అంకెల ప్రత్యేక గుర్తింపు.. పశు ఆధార్**

జాతీయ డిజిటల్ పశుసంపద మిషన్‌లో భాగంగా ప్రతి పశువుకు 12 అంకెల ప్రత్యేక గుర్తింపు సంఖ్యతో కూడిన బార్‌కోడ్ చెవి ట్యాగ్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రత్యేక ట్యాగ్ ద్వారా పశువుకు డిజిటల్ గుర్తింపు కల్పించి, దాని పూర్తి సమాచారాన్ని పశుధన్ యాప్, భారత్ పశుధన్ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు.

ఒకసారి కేటాయించిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య ద్వారా సంబంధిత పశువు యొక్క వివరాలు డిజిటల్‌గా అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు. పశువు యజమాని ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, పేరు, వయస్సు, లింగం, సామాజిక వర్గం, పూర్తి చిరునామా, స్థానం, పాల ఉత్పత్తిదారుల సంఘం లేదా మిల్క్ యూనియన్ సభ్యత్వం, భూమి వివరాలు తదితర సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.

**పశువు పూర్తి వివరాలు డిజిటల్‌గా నమోదు చేయాలి**

ప్రతి పశువు యొక్క జాతి, వయస్సు, లింగం, పుట్టిన తేదీ, యాజమాన్య వివరాలు, మరణం, పాల ఉత్పత్తి, పాలిచ్చే స్థితి, పొడి దశ తదితర వివరాలను పశుధన్ యాప్‌లో ఖచ్చితంగా నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు.పశువుల క్రయవిక్రయాలు జరిగినప్పుడు యాజమాన్య మార్పు, పశువు ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి తరలింపు, రవాణా, కదలికల వివరాలను కూడా సంబంధిత 12 అంకెల ట్యాగ్ ఐడీకి అనుసంధానం చేసి నమోదు చేయాలని సూచించారు.

**వ్యాక్సినేషన్, చికిత్స వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలి**

ప్రతి పశువుకు అందించే వ్యాక్సినేషన్, వ్యాధుల నిర్ధారణ, వైద్య చికిత్స, మందుల వినియోగం, ఫాలోఅప్ వివరాలను పశుధన్ యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఏ పశువుకు ఏ వ్యాక్సిన్ ఎప్పుడు ఇచ్చారు, ఎలాంటి వైద్య సేవలు అందించారు అనే పూర్తి సమాచారం డిజిటల్ రికార్డులో అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.పశువులకు వచ్చే వ్యాధులను ముందస్తుగా గుర్తించడం, వ్యాధుల పర్యవేక్షణ, వ్యాధి నియంత్రణ చర్యలను సమర్థవంతంగా చేపట్టేందుకు డిజిటల్ డేటా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**సంతానోత్పత్తి వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలి**

పశువుల సంతానోత్పత్తికి సంబంధించిన కృత్రిమ గర్భధారణ గర్భ నిర్ధారణ  గర్భధారణ, దూడ పుట్టిన వివరాలు తదితర సమాచారాన్ని సంబంధిత పశువు ట్యాగ్ ఐడీకి అనుసంధానం చేసి నమోదు చేయాలని సూచించారు.పాలిచ్చే పశువులు, పొడి దశలో ఉన్న పశువుల వివరాలను కూడా సక్రమంగా నమోదు చేయాలని తెలిపారు. పశువుల ఉత్పాదకత, సంతానోత్పత్తి సామర్థ్యం తదితర అంశాలకు సంబంధించిన సమగ్ర సమాచారం అందుబాటులో ఉండేలా చూడాలని ఆదేశించారు.

**గొర్రెలు, మేకల మంద వివరాలు కూడా నమోదు చేయాలి**

గొర్రెలు, మేకలకు సంబంధించిన మంద నిర్వహణ, పశువుల సంఖ్య, ఆరోగ్య పరిస్థితి, వ్యాక్సినేషన్, చికిత్స, వ్యాధుల పర్యవేక్షణ, ఫాలోఅప్ తదితర వివరాలను కూడా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని కలెక్టర్ తెలిపారు.

అదేవిధంగా కుక్కల నియంత్రణకు సంబంధించిన యానిమల్ బర్త్ కంట్రోల్  కార్యక్రమం, వ్యాధుల పర్యవేక్షణ, వ్యాధి నియంత్రణ చర్యలు, పశుసంవర్ధక శాఖకు సంబంధించిన మౌలిక వసతుల మ్యాపింగ్ వివరాలను కూడా డిజిటల్ ప్లాట్‌ఫాంలో నమోదు చేయాలని సూచించారు.

మండల, గ్రామ స్థాయి కమిటీలు సమన్వయంతో పనిచేయాలి

ఎన్ డి ఎల్ యం  కార్యక్రమం సమర్థవంతమైన అమలు కోసం జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా, మండల స్థాయిలో సంబంధిత అధికారులతో, గ్రామ స్థాయిలో సంబంధిత సిబ్బంది, ప్రతినిధులతో కమిటీలను ఏర్పాటు చేసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. మండల స్థాయి కమిటీలు తమ పరిధిలోని అన్ని గ్రామాల్లో డేటా క్యాప్చర్, పశువుల ట్యాగింగ్, పశు ఆధార్ నమోదు ప్రక్రియను పర్యవేక్షించాలని తెలిపారు.

గ్రామ స్థాయి కమిటీలు ప్రతి ఇంటిని, ప్రతి పశువును క్షేత్రస్థాయిలో పరిశీలించి, ఏ ఒక్క పశువు కూడా డిజిటల్ నమోదు నుంచి మిగిలిపోకుండా చూడాలని ఆదేశించారు.

ప్రతిరోజూ గ్రామాల వారీగా ట్యాగింగ్, డేటా క్యాప్చర్ పురోగతిని సమీక్షించాలని, పెండింగ్‌లో ఉన్న వివరాలను గుర్తించి వెంటనే పూర్తి చేయాలని సూచించారు. మిగిలిన 22 శాతం డేటా క్యాప్చర్, ట్యాగింగ్ ప్రక్రియను 10 రోజుల్లోగా పూర్తి చేసి వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

పశువులకు డిజిటల్ గుర్తింపు కల్పించడం ద్వారా ప్రతి పశువు యొక్క ఆరోగ్యం, వ్యాక్సినేషన్, చికిత్స, సంతానోత్పత్తి, పాల ఉత్పత్తి, యాజమాన్యం, క్రయవిక్రయాలు, రవాణా, వ్యాధుల పర్యవేక్షణ తదితర వివరాలపై సమగ్ర సమాచారం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ డిజిటల్ డేటా ఆధారంగా పశుసంవర్ధక శాఖ అందించే సేవలను మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా అందించడంతో పాటు, పశువుల ఆరోగ్య పరిరక్షణ, వ్యాధుల నియంత్రణ, సంతానోత్పత్తి మరియు పశుసంపద అభివృద్ధికి మెరుగైన ప్రణాళికలు రూపొందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.

డేటా నమోదు, ట్యాగింగ్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఖచ్చితత్వంతో పనిచేయాలని, నిర్దేశించిన గడువులోగా ప్రతి పశువుకు 12 అంకెల డిజిటల్ గుర్తింపు కల్పించి, పూర్తి సమాచారాన్ని పశుధన్ యాప్‌లో నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. ప్రకాశ్, జడ్పీ సీఈవో గౌతం రెడ్డి, డి.పి.ఓ,మదన్మోహన్, డి ఏ ఓ భాస్కర్, మున్సిపల్ కమిషనర్లు, మండల పశు వైద్య అధికారులు, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సారంగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్





**జగిత్యాల / సారంగాపూర్ సెప్టెంబర్ 18,(నవగీతం)** జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాజ గౌడ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్న భోజనం, పరిశుభ్రత, వంటశాల నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు. పాఠశాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం పాఠశాలలో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు, పాఠశాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన, పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపివో సలీమ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో గోవిందరావుపేట తహసీల్దార్.

**రూ.14 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ తహసీల్దార్ సృజన్ కుమార్.**




**ములుగు, సెప్టెంబర్ 18,(నవగీతం)** గోవిందరావుపేట. ములుగు జిల్లాలో అవినీతి అధికారులకు ఏసీబీ చెక్ పెట్టింది. లంచం తీసుకుంటూ గోవిందరావుపేట తహసీల్దార్ సృజన్ కుమార్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా చిక్కాడు. అసలేం జరిగింది: గోవిందరావుపేట మండలానికి చెందిన ఒక రైతు తన తండ్రి పేరు మీద ఉన్న భూమిని తన పేరు మీదకు పౌతి మార్పిడి చేసుకోవడం కోసం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆశ్రయించాడు. అయితే ఈ పని చేయడం కోసం తహసీల్దార్ సృజన్ కుమార్ రూ.14 వేలు లంచం డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు ముందస్తు ప్రణాళిక సిద్ధం చేశారు. బాధితుడి నుండి రూ.14 వేలు లంచం తీసుకుంటుండగా తహసీల్దార్ ను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు కొనసాగిస్తున్నారు. కార్యాలయంలోని ఫైళ్లు, రికార్డులను పరిశీలిస్తున్నారు. తహసీల్దార్ అదుపులోకి తీసుకుని వరంగల్ ఏసీబీ కార్యాలయానికి తరలించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గోవిందరావుపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్రిక్తత నెలకొంది. రెవెన్యూ శాఖలో అవినీతి మరోసారి బయటపడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మొరుమూరు గ్రామపంచాయతీ లో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం.

**ప్రగల్లపల్లి పాఠశాలలో చెత్త వేరు చేసే విధానంపై విద్యార్థులకు అవగాహన.**




**ములుగు, సెప్టెంబర్ 18,(నవగీతం)** వాజేడు మండలం మొరుమూరు గ్రామ పంచాయతీ పరిధిలో స్వచ్ఛతా హి సేవా – 2026 కార్యక్రమంలో భాగంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రగల్లపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు చెత్తను వేరు చేసే విధానం గురించి పంచాయతీ సిబ్బంది వివరించారు. ముఖ్యంగా నాలుగు రకాల చెత్త – తడి చెత్త, పొడి చెత్త, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక వ్యర్థాలను ఎలా వేరు చేయాలి, వాటిని విడివిడిగా ఎలా సేకరించాలి అనే అంశాలపై పిల్లలకు అవగాహన కల్పించారు. పరిసరాల పరిశుభ్రత, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం, పర్యావరణ పరిరక్షణపై కూడా వివరించారు. అనంతరం ప్రగల్లపల్లి అంగన్‌వాడీ టీచర్ కు మరియు పాఠశాల టీచర్ కు 4 రకాల చెత్తను వేరు చేయడానికి ఉపయోగించే డబ్బాలు (బిన్స్) అందజేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలలో చెత్త వేరుచేసే విధానాన్ని తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మడకం సుభద్ర, ఉప సర్పంచ్ కుంజా సుజాత, వార్డు నెంబర్ శంకర్, పంచాయతీ కార్యదర్శి కార్తీక్, పంచాయతీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ లక్ష్యాన్ని నెరవేర్చడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, తమ ఇంటి నుండే చెత్త వేరుచేసే అలవాటును ప్రారంభించాలని ఈ సందర్భంగా సర్పంచ్ పిలుపునిచ్చారు.

## కేజీబీవీని ఆకస్మికంగా తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

**పదో తరగతి విద్యార్థినులకు విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం**





**జగిత్యాల/గొల్లపల్లి, సెప్టెంబర్18,(నవగీతం)** గొల్లపెల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి. ఎస్. లత శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం నాణ్యత, రుచితో పాటు విద్యార్థినులకు అందుతున్న ఆహారంపై వివరాలను సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.విద్యార్థినులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులతో మాట్లాడి, వారి విద్యాభ్యాసం, పరీక్షల సన్నద్ధతపై మార్గనిర్దేశం చేశారు. పదో తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులు క్రమశిక్షణతో చదువుతూ, సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థిని తన లక్ష్యాన్ని నిర్దేశించుకొని, ఉన్నత విద్యను అభ్యసించే దిశగా ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తూ, పరీక్షల కోసం అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని సూచించారు.పాఠశాలలో విద్యార్థినులకు అందుతున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ పరిశీలనలో తహసీల్దార్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
19 సెప్టెంబర్ 2026

# అంగన్వాడీ పిల్లలతో సరదాగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

**బుజ్జి బుజ్జి మాటలకు మురిసిన కలెక్టర్.. చిన్నారులకు అభినందనలు**

**అంగన్వాడి చిన్నారులతో ముచ్చటిస్తూ మురిసిపోయిన జిల్లా కలెక్టర్**



**జగిత్యాల/కథలాపూర్, సెప్టెంబర్18, (నవగీతం)** కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలోని అంగన్వాడీ చిన్నారులతో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ సరదాగా ముచ్చటిస్తూ సందడి చేశారు. అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చిన్నారుల వద్దకు వెళ్లి ఆప్యాయంగా పలకరించారు. వారి పేర్లు, చదువు, ఇష్టమైన ఆటలు, పాటల గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు చిన్నారులు తమదైన శైలిలో బుజ్జి బుజ్జి సమాధానాలు ఇచ్చారు. చిన్నారుల సమాధానాలు విన్న కలెక్టర్ సంతోషం వ్యక్తం చేస్తూ వారిని అభినందించారు. కొంతమంది చిన్నారులు ధైర్యంగా ఎబిసిడి లు, 1,2,3 లు చెప్పి తమ ప్రతిభను ప్రదర్శించారు. పిల్లల చురుకుదనం, సమయస్ఫూర్తిని చూసి కలెక్టర్ మురిసిపోయారు. చిన్నారులతో కాసేపు సరదాగా గడుపుతూ వారిలో ఉత్సాహాన్ని నింపారు. కలెక్టర్ తమతో ఆప్యాయంగా మాట్లాడటంతో చిన్నారులు మరింత ఉత్సాహంగా స్పందించారు. వారి కేరింతలు, నవ్వులతో అంగన్వాడీ కేంద్రం సందడిగా మారింది. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు అందుతున్న సౌకర్యాలను కలెక్టర్ పరిశీలించారు. పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, మెనూ అమలు, పరిశుభ్రత తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలని తెలిపారు. ఆటపాటల ద్వారా చిన్నారుల్లో అభ్యసన ఆసక్తిని పెంపొందించాలని సూచించారు. పిల్లల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కలెక్టర్ పేర్కొన్నారు. న్నారులకు విద్యతో పాటు మంచి అలవాట్లను అలవర్చాలని ఉపాధ్యాయులకు తెలిపారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారం, చేతులు శుభ్రంగా కడుక్కోవడం వంటి అంశాలపై పిల్లలకు ఇప్పటినుండే అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లల ప్రతిభను చిన్న వయస్సు నుంచే గుర్తించి ప్రోత్సహించాలని అన్నారు. ప్రతి చిన్నారికి ప్రేమ, ఆప్యాయతతో సేవలు అందించాలని అంగన్వాడీ సిబ్బందికి సూచించారు. చిన్నారులతో మమేకమై వారి మాటలు వింటూ కలెక్టర్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. కథలు, పాటలు, ఆటలు, చిత్రలేఖనం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యం, పోషణ, ప్రాథమిక అభ్యసనంపై నిరంతరం పర్యవేక్షణ ఉండాలని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కలెక్టర్ తమతో సరదాగా ముచ్చటించడంతో చిన్నారుల్లో ఆనందం వెల్లివిరిసింది. బుజ్జి మాటలతో సమాధానాలు చెబుతున్న చిన్నారులను చూసి కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. వారి ప్రతిభను మరింతగా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. చిన్నారుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. పిల్లల సంక్షేమానికి ప్రభుత్వం అందిస్తున్న సేవలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. చిన్నారులతో కలెక్టర్ ఆప్యాయంగా ముచ్చటించిన దృశ్యం అక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధికారి హోదాను పక్కనపెట్టి పిల్లలతో కలిసిమెలిసి మాట్లాడిన తీరు స్థానిక ప్రజా ప్రతినిధులను, ఉపాధ్యాయులను ఆకట్టుకుంది. చిన్నారుల కేరింతలు, నవ్వులతో అంగన్వాడీ కేంద్రం ఆహ్లాదకరంగా మారింది. పిల్లల బుజ్జి సమాధానాలు కలెక్టర్‌ను సంతోషపరిచాయి. చిన్నారుల చురుకుదనాన్ని అభినందిస్తూ వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు. పిల్లల ఆరోగ్యం, విద్య, పోషణకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. అంగన్వాడీ సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. ప్రతి చిన్నారికి మెరుగైన బాల్యాన్ని అందించేందుకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిన్నారుల ముఖాల్లో చిరునవ్వులు కనిపించేలా అంగన్వాడీ కేంద్రాల్లో సానుకూల వాతావరణం ఉండాలని చెప్పారు. అదేవిధంగా గ్రామం లో నిర్మిస్తున్న వివో భవనాన్ని పరిశీలించి పూర్తి స్థాయిలో పనులు చేసి భవనం ప్రారంభత్సవం చేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. గ్రామం లోని జనాభా, మహిళా సంఘాల వివరాలు, గ్రామం లో ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి పనుల వివరాలను సర్పంచ్ సంబ నవీన్ ను కలెక్టర్ కు వివరించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయం తో పనిచేసి గ్రామభివృద్ధిలో పాలు పంచుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డిఈవో కె. రాము, డిపివో మదన్ మోహన్, తహసీల్దార్, ఎంపిడివో, ఇప్పపెల్లి గ్రామ సర్పంచ్ సంబ నవీన్, వార్డు సభ్యులు, గ్రామస్థులు అంగన్వాడీ సిబ్బంది, మరియు తదితరులు పాల్గొన్నారు.



# కథలాపూర్ మండలంలో జిల్లా కలెక్టర్ విస్తృత పర్యటన

**పలు నిర్మాణ భవనాలు, జిల్లా పరిషత్ పాఠశాల ఆకస్మిక తనిఖీ**

**విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్**



**జగిత్యాల / కథలాపూర్, సెప్టెంబర్ 18, (నవగీతం)** కథలాపూర్ మండలం, ఇప్పపెల్లి, సిరికొండ గ్రామాల్లోని నిర్మాణం లో ఉన్న వివో భవనాలను, అంగన్వాడీ భవనాన్ని, ప్రాథమిక పాఠశాల కిచెన్ షెడ్, జిల్లా పరిషత్ పాఠశాలను శుక్రవారం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఇప్పపెల్లి గ్రామంలోని వీవో భవనాన్ని, ప్రాథమిక పాఠశాల లోని కిచెన్ షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి నాణ్యతతో నెలరోజుల్లో పనులు పూర్తి చేసి వాడుకలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

అదేవిధంగా అంగన్వాడీ, ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అంగన్వాడీ పిల్లలతో ఏ.బి.సి.డి లు, 1,2,3 లు చదివించారు. పిల్లలు చురుకుగా ఉత్సాహంగా అడిగిన వెంటనే తడబడకుండా ఏ.బి.సి.డి లు, 1,2,3 లు చెప్తుంటే పిల్లలను, ఉపాధ్యాయురాలును అభినందించారు. పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఆదేశించారు. అనంతరం సిరికొండ గ్రామంలోని నిర్మాణం లో ఉన్న వివో భవనం, అంగన్వాడీ కేంద్రం భవనాన్ని పరిశీలించారు.

పనులను వేగవంతంగా, నాణ్యతతో పూర్తి చేయాలని పనులలో జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని అన్నారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలను సందర్శించి విద్యార్థుల స్థితిగతులను, వారికి కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా విద్యా ప్రమాణాలు, మౌళిక సదుపాయాల తీరును పరిశీలించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి క్లాస్ రూమ్ లో ఎంతమంది విద్యార్థులు ఉన్నారు అని ఆరా తీశారు. పాఠశాలలోని ప్రతీ విద్యార్థి పై ప్రత్యేక దృష్టి సారించాలని, సర్కారు బడుల్లో క్వాలిఫైడ్ ఉపాద్యాయులు పనిచేస్తున్నారని, భావి తరాలకు అవసరమైన విద్యా బోధన చేయడం జరుగుతున్నదని తెలిపారు. విద్యార్థులతో ముఖాముఖి సంభాషణ జరిపి వారి బోధన స్థితిగతులను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. తరగతుల నిర్వహణ, పారిశుద్ధ్య సౌకర్యాలు వంటి అంశాలను పరిశీలించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణలో పెంచుతున్న కూరగాయల చెట్లను పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నం భోజనం చేసి విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందుతున్నదా/ లేదా అనే విషయాన్ని పిల్లలను, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని, భోజన తయారీ విషయంలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిదంగా ఒప్పంద నిర్వాహకుడితో మాట్లాడి నాణ్యతతో కూడిన సరుకులు అందించాలని తెలిపారు. పాఠశాల తరగతి గదులలో పరిసరాల పరిశుభ్రతను పాటించాలని ఉపాధ్యాయులకు ఆదేశించారు. పాఠశాల ఆవరణంలో పిచ్చి మొక్కలు తొలగించి, శానిటేషన్ చేయించాలని సూచించారు. ముఖ్యంగా పాఠశాల ఉపాధ్యాయులు సమయపాలన తప్పకుండా పాటించాలని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం పట్ల అసహనం వ్యక్తం చేస్తూ రుచికరంగా వండేలా చర్యలు తీసుకోవాలని డిఈవో ను హెచ్చరించారు. ఈ పరిశీలనలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, డి.ఈ.వో. కె. రాము, తహసీల్దార్, ఎంపిడివో, ఏఈ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.

# కరువు బారిన చర్ల రైతులు, కూలీలు ప్రభుత్వం ఆదుకోవాలి. ఎ.ఐ.కె.ఎం.ఎస్.డిమాండ్.

**తహసిల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతి పత్రం అందజేత.**

**చర్ల, సెప్టెంబర్ 18, (నవగీతం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలో సాధారణ వర్షపాతం కంటే 50% తక్కువ వర్షపాతం నమోదై కరువు పరిస్థితులు నెలకొన్నాయని, రైతులు, కూలీలను ఆదుకోవాలని అఖిల భారత రైతు-కూలీ సంఘం చర్ల మండల కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా నాయకులు సంతపూరి సురేష్ మాట్లాడుతూ, అదును ప్రకారం వర్షాలు పడకపోవడం వల్ల ఈ సీజన్ లో తీవ్ర పంట నష్టం జరగబోతోందని, అప్పులతో ఉన్న రైతులు, ఉపాధి లేని కూలీలు పస్తులు ఉండే పరిస్థితి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వలసలు పెరిగే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. కరువుపై క్షేత్రస్థాయి అధ్యయనం చేసి నివేదిక తయారు చేయాలి. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలి, రైతు ఆత్మహత్యలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలి. బోర్లకు రోజుకు 16 గంటల నాణ్యమైన కరెంటు ఇవ్వాలి రేషన్ ద్వారా నిత్యవసరాలు సబ్సిడీపై ఇవ్వాలి.

ఉపాధి హామీ కూలీలకు రూ.600 కూలితో 200 రోజుల పని కల్పించాలి.

వ్యవసాయ కూలీలకు ఇస్తామన్న రూ.12 వేల పథకం బకాయిలతో కలిపి రూ.36 వేలు వెంటనే ఇవ్వాలి బ్యాంకు రుణాలు రద్దు చేయాలి సీతారామ ప్రాజెక్టు నీళ్లతో మండలంలోని రేగులగండి, పగిడేరు, సాంబయ్యగూడెం చెరువులను నింపి శాశ్వత కరువు నివారణ చేపట్టాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గం పిలుపులో భాగంగా కరువు సహాయక చర్యలు చేపట్టాలని చర్ల డిప్యూటీ తాసిల్దార్ కు వినతి పత్రం ఇచ్చి, పోస్టర్ ఆవిష్కరణ చేసిన అఖిలభారత రైతు కూలీ నాయకులు కుంజ జోగారావు మట్ట నరసింహారావు గొంది ముయన్న రైతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# అంగన్‌వాడీ పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**హిమ్మత్‌రావుపేటలో 'పోషణ మాసం' వేడుకలు**



**కొడిమ్యాల సెప్టెంబర్ 18. (నవగీతం)** కొడిమ్యాల మండల పరిధిలోని హిమ్మత్‌రావుపేట అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ మల్యాల ప్రాజెక్టు ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ మల్యాల అనసూర్య అధ్యక్షతన 'పోషణ మాసం' కార్యక్రమం నిర్వహించారు.?ఈ సమావేశానికి హాజరైన గ్రామ ఉపసర్పంచ్ పునుగోటి కృష్ణారావు మాట్లాడుతూ...అంగన్‌వాడీ కేంద్రాలలో గర్భిణులు, బాలింతలు 3 నుండి 6 సంవత్సరాల పిల్లల కోసం ప్రభుత్వం అనుబంధ పోషకాహారాన్ని అందిస్తుందని తెలిపారు. లబ్ధిదారులందరూ ఈ పోషకాహారాన్ని క్రమం తప్పకుండా తీసుకోవాలని సూచించారు. అలాగే 6 నెలల నుండి 3 సంవత్సరాల వయస్సు ఉన్న పిల్లలకు అందించే 'బాలామృతం'ను ప్రతిరోజూ సరైన మోతాదులో తినిపించాలని కోరారు.?ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు శ్రీమంతం వేడుకను ఘనంగా నిర్వహించారు.?ఈ కార్యక్రమంలో కొడిమ్యాల సెక్టార్ సూపర్‌వైజర్ ఉమ, వార్డు మెంబర్ లత, అంగన్‌వాడీ టీచర్లు రాజమణి, సుశీల, మౌనిక, సుజాత, కనకమ్మ, ఆశా కార్యకర్త రజితలతో పాటు పలువురు గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

# లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన హాస్టల్ వార్డెన్.




**చర్ల, సెప్టెంబర్18, (నవగీతం)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మరో అవినీతి అధికారి ఏసీబీ వలలో చిక్కాడు. చర్ల మండలం సత్యనారాయణపురం ఎస్టీ బాలుర వసతి గృహం వార్డెన్ వాల్ సింగ్ రూ.14 వేల లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. సత్యనారాయణపురం ఎస్టీ బాలుర హాస్టల్ లో పనిచేస్తున్న కుక్ కు సంబంధించిన బిల్లులు పెండింగ్ లో ఉన్నాయి. ఆ బిల్లును క్లియర్ చేసి, డబ్బులు విడుదల చేయడం కోసం హాస్టల్ వార్డెన్ వాల్ సింగ్ బాధితుడి వద్ద రూ.14 వేలు లంచంగా డిమాండ్ చేశాడు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు వెంటనే ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ ఆధ్వర్యంలో అధికారులు పక్కా ప్రణాళికతో వల వేశారు. రసాయనం పూసిన నోట్లను బాధితుడి ద్వారా వార్డెన్ కు ఇప్పించారు. వార్డెన్ వాల్ సింగ్ డబ్బులు తీసుకుంటుండగానే ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. అనంతరం వార్డెన్ చేతులపై రసాయన పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ గా తేలింది. నిందితుడి వద్ద నుండి లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు. టేబుల్ పై నోట్లను, =ఎ, జూ, ూఎ అని రాసి ఉన్న మూడు బాటిళ్లతో ఫొటో తీసి ఆధారంగా నమోదు చేశారు. ప్రస్తుతం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. గిరిజన సంక్షేమ హాస్టల్ లోనే ఇలాంటి అవినీతి జరగడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఆలేరు నియోజకవర్గంలో నీళ్ల సమస్యకు త్వరలో పరిష్కారం

**మంత్రి కోమటిరెడ్డి**

శాసనసభ జీరో అవర్ లో ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి సమాధానం ఇచ్చారు. ఆలేరు నియోజకవర్గంలో చిన్న మున్సిపాలిటీలు ఇన్కమ్ లేక ఇబ్బందులు పడుతున్నాయి. కొత్తగా ఆర్డిఓ కార్యాలయం మంజూరు చేస్తే ఆలేరు ప్రాంతానికి కేటాయిస్తామని హామీ ఇచ్చారు . ఆలేరు ప్రాంతానికి కేటాయించాలని సభ ద్వారా రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకొని వెళ్తున్నాను. యాదగిరిగుట్టకు రోజుకు లక్షమంది భక్తులు వస్తున్నారు. బ్రిడ్జ్ స్థానంలో రోడ్ వెడల్పు చేసేందుకు కసరత్తు జరుగుతుంది. కేంద్రం సహకారంతో పర్వత్ మాలా స్కీంలో 2రోప్ వేలు యాదగిరిగుట్ట,తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాము. నీళ్ల సమస్యపై చర్చించి త్వరలోనే పరిష్కారం చూపటం జరుగుతుందని అన్నారు.

# ఆత్మకూరులో మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పర్యటన

**ఆత్మకూరు :** ఆత్మకూరులో తన పర్యటనలో భాగంగా రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఆత్మకూరులోని వెస్ట్ ఎంపీపీఎస్ పాఠశాల ప్రాంగణంలో రూ.28.30 లక్షల వ్యయంతో నిర్మించిన భవిత భవనాన్ని చిన్నారులతో కలిసి ప్రారంభించారు. ఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో రూ.53 లక్షల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వనరుల కేంద్రం (ఎంఆర్సీ), ఎంఈఓ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు, ఉపాధ్యాయులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి ఆనం వెల్లడించారు. ఆత్మకూరు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశంలో మంత్రి పాల్గొన్నారు.

# ఫాస్ట్ ట్రాక్ లో 22-ఏ పరిష్కారం

**ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు**

**118 జీవో ప్రకారం 19నుంచి రెగ్యులరైజేషన్**

**అసెంబ్లీలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**హైదరాబాద్:-** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శాసన సభలో చేసిన ప్రకటనకు అనుగుణంగా 22-ఏ కు సంబంధించిన అన్ని అంశాలను ఫాస్ట్ ట్రాక్ లో పరిష్కరించడానికి ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు శుక్రవారం నాడు శాసనసభలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రకటించారు. ఇందుకు సంబంధించి జీ.ఓ.ఆర్.టి నెం. 564 ను , జారీచేసినట్లు తెలిపారు. ఈ కమిటీకి చైర్మన్ గా సిసిఎల్ఎ డి.ఎస్. లోకేష్ కుమార్

నవగీతం
తెలుగు దినపత్రిక
శనివారం
19 సెప్టెంబర్ 2026

# కిరణ్ అబ్బవరం నిర్మాతగా హతః.. ఆసక్తిగా టీజర్



కిరణ్ అబ్బవరం హీరోగా మాత్రమే కాదు.. నిర్మాతగానూ ఇండస్ట్రీలో రాణిస్తున్నారు. ఇప్పటికే తన బ్యానర్‌లో తిమ్మరాజుపల్లి టీవీ సినిమాతో నిర్మాతగా మారారు. తాజాగా తన క ప్రొడక్షన్స్ నిర్మాణంలో మరో సినిమా వచ్చేస్తోంది. ఈ సారి థ్రిల్లర్ జానర్‌లో మూవీని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. తాజాగా ఈ మూవీ టీజర్ రిలీజ్ చేశారు మేకర్స్. కుష్లు మద్దాల, రెహ్మాన్, నమ్రిత ఎంవీ, తనూజ పుట్టస్వామి కీలక పాత్రల్లో వస్తోన్న థ్రిల్లర్ మూవీ హతః. ఈ సినిమాకు అనుష్ గోరాక్ దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్‌లోని సన్నివేశాలు చూస్తుంటే హారర్ థ్రిల్లర్‌గానే తెరకెక్కించినట్లు తెలుస్తోంది. ఈ మూవీని దీపావళి కానుకగా నవంబరు 6న థియేటర్లలో సందడి చేయనుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. కాగా.. ఈ సినిమాకు జేసిన్ జార్జ్ సంగీతమందిస్తున్నారు.




# సీఎం విజయ్ కుమారుడి దర్శకత్వంలో సందీప్ కిషన్.. 'సిగ్మా' ట్రైలర్ విడుదల

యంగ్ హీరో సందీప్ కిషన్ నటిస్తున్న తాజా చిత్రం 'సిగ్మా'. ఈ సినిమా తెలుగు ట్రైలర్‌ను శుక్రవారం విడుదల చేశారు. యాక్షన్, అడ్వెంచర్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి తమిళనాడు సీఎం విజయ్ కుమారుడు జేసన్ సంజయ్ దర్శకత్వం వహించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. దర్శకుడిగా జేసన్‌కు ఇదే తొలి చిత్రం కావడంతో సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. విడుదలైన ట్రైలర్‌ను బట్టి ఇదొక స్టైలిష్ యాక్షన్, ట్రెజర్ హంట్ మూవీ అని స్పష్టమవుతోంది. భారీ యాక్షన్ సన్నివేశాలు, ఛేజింగులు, నిధి అన్వేషణకు సంబంధించిన విజువల్స్ ఆకట్టుకుంటున్నాయి. యాక్షన్, అడ్వెంచర్‌తో పాటు కాస్తంత హాస్యం కూడా జోడించినట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన కథానాయికగా ఫరియా అబ్దుల్లా నటిస్తోంది. రాజు సుందరం, సంపత్ రాజ్, శివ్ పండిట్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే సినిమా షూటింగ్ పూర్తయినట్లు చిత్రబృందం ప్రకటించింది. గతేడాది డిసెంబర్‌లో విడుదలైన టీజర్‌తో మంచి బజ్ క్రియేట్ చేసిన 'సిగ్మా', ఇప్పుడు ట్రైలర్‌తో అంచనాలను మరింత పెంచింది. తెలుగు, తమిళ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమా పంపిణీ హక్కులను ప్రముఖ సంస్థలైన మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ (కోస్తాంధ్ర, తెలంగాణ), ఎస్వీఆర్ సినిమా (సీడెడ్) దక్కించుకోవడం విశేషం.

# 'రాకా'పై పెరుగుతున్న ఆసక్తి.. '37' తర్వాత మరో క్రిప్టిక్ టీజర్!





అల్లు అర్జున్-అట్లీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న సైన్స్ ఫిక్షన్ మూవీ 'రాకా'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. సినిమా కథ, పాత్రలకు సంబంధించిన వివరాలను మేకర్స్ ఇప్పటికీ రహస్యంగానే ఉంచుతున్నారు. తాజాగా మరో క్రిప్టిక్ టీజర్‌ను విడుదల చేయడంతో అభిమానుల్లో కొత్త చర్చ మొదలైంది. సన్ పిక్చర్స్ విడుదల చేసిన ఈ వీడియోలో.. "అసాధ్యంగా అనిపించిన దానిని దాటి.. ఊహించడానికి ధైర్యం చేశాం. దాన్ని ఆర్కైవ్ చేయడానికి ధైర్యం చేశాం. రాకా: ఏ గ్లోబల్ ట్రయంఫ్" అంటూ క్యాప్షన్ ఇచ్చారు. అయితే 'గ్లోబల్ ట్రయంఫ్' అంటే ఏంటి? సినిమాకు సంబంధించిన ఏ అంశాన్ని ఇది సూచిస్తోంది? అనే విషయాలను మాత్రం వెల్లడించలేదు. ఒకరోజు ముందు మేకర్స్ విడుదల చేసిన '37' అనే సంకేతం కూడా ఇప్పటికే సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు 'గ్లోబల్ ట్రయంఫ్' అనే మరో క్లూతో అసలు కథేంటన్న ఆసక్తిని మరింత పెంచారు. 'రాకా' రెండు కాలాల్లో సాగే కథగా తెలుస్తోంది. ఆధునిక కాలానికి సంబంధించిన కథలో మృణాల్ ఠాకూర్ కీలక పాత్రలో కనిపించనున్నారు. పురాణ వైదిక కాలానికి సంబంధించిన భాగంలో దీపికా పదుకొణె, జాన్వీ కపూర్, రష్మిక మందన్న నటిస్తున్నట్లు సమాచారం. దీపిక ఓ గర్భిణి పాత్రలో కనిపించనున్నట్లు గతంలో కథనాలు వచ్చాయి. రష్మిక ఆమెకు మార్గదర్శిగా, రక్షకురాలిగా కనిపిస్తారని సమాచారం. జాన్వీ గిరిజన రాణి పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రం అట్లీ దర్శకత్వంలో అల్లు అర్జున్‌కు తొలి సినిమా. షారుక్ ఖాన్ కూడా అంతర్జాతీయ షెడ్యూల్‌లో కీలక అతిథి పాత్ర కోసం షూటింగ్‌లో పాల్గొననున్నట్లు సమాచారం. అయితే '37'కు 'గ్లోబల్ ట్రయంఫ్'కు ఉన్న సంబంధం ఏంటన్నది మాత్రం మేకర్స్ ఇంకా వెల్లడించలేదు.



# మగాళ్లు జిందాబాద్.. శ్రీనందు టైటిల్ రివీల్

టాలీవుడ్ హీరో శ్రీనందు, లక్ష్మీ ప్రధాన పాత్రల్లో వస్తోన్న మూవీ మగాళ్లు జిందాబాద్. ఈ సినిమాకు నారా ప్రవీణ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని గోల్డెన్ ఆర్క్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రసాద్ భాస్కర్ల, చైతన్య వంగవరపు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ మోషన్ పోస్టర్ రిలీజ్ చేశారు. ఈ టైటిల్ చూస్తుంటే మగాళ్ల జీవితాల నేపథ్యంలోనే కథ ఉండనుందని తెలుస్తోంది. ఈ చిత్రాన్ని ఫుల్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందిస్తున్నట్లు పోస్టర్స్ చూస్తుంటే అర్థమవుతోంది. ఈ చిత్రంలో వైవా హర్ష, వెన్నెల కిశోర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ సినిమాకు శ్రీచరణ్ పాకాలా, మదిన్ ఎస్కే సంగీత దర్శకులుగా వ్యవహరిస్తున్నారు.




# ఉపేంద్ర బర్త్‌డే స్పెషల్.. 'జాంబీ రెడ్డి 2' నుంచి రియల్ స్టార్ ఫస్ట్ లుక్ రిలీజ్!

కన్నడ రియల్ స్టార్ ఉపేంద్ర పుట్టినరోజు సందర్భంగా టాలీవుడ్ మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జాంబీ రెడ్డి 2' నుంచి మేకర్స్ అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చారు. ఈ సినిమాకు సంబంధించిన ఉపేంద్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేయగా, ప్రస్తుతం సోషల్ మీడియాలో ఈ పోస్టర్ తెగ వైరలవుతోంది. ప్రపంచాన్ని తలకిందులు చేసేందుకు రియల్ స్టార్ సిద్ధమవుతున్నారంటూ చిత్రబృందం విడుదల చేసిన ఈ పోస్టర్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేసింది. ఇప్పటివరకు వెండితెరపై ఎన్నడూ చూడని సరికొత్త, వైవిధ్యమైన అవతార్‌లో ఉపేంద్ర కనిపించబోతున్నారని మేకర్స్ తెలిపారు. ఆయన పాత్రలో కనిపించే మ్యాడ్‌నెస్, మరియు మాస్ కలగలిసిన సరికొత్త ఫ్లేవర్ ప్రేక్షకులను ఖచ్చితంగా షాక్‌కు గురిచేసేలా ఉంటుందని యూనిట్ పేర్కొంది. సూపర్‌హీరో తేజ సజ్జాతో కలిసి ఉపేంద్ర స్క్రీన్ షేర్ చేసుకోబోతుండటం ఈ సినిమాకు ప్రధాన హైలైట్ కానుంది. వీరిద్దరి కలయికలో వచ్చే మాస్ రచ్చ ఎలా ఉండబోతుందనే ఆసక్తి ప్రస్తుతం సర్వత్ర నెలకొంది. మొత్తానికి 'జాంబీ రెడ్డి 2' తో రాబోతున్న ఈ నెక్ట్స్ లెవెల్ మ్యాడ్‌నెస్ కోసం ప్రేక్షకులు, అభిమానులు ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నారు.